నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | శనివారం 5-6-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 256 | పేజీలు: 4 | వెల: రూ.1/-

పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలకు సీఎం కేసీఆర్ పిలుపు

హైదరాబాద్ , జూన్ 4:నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలకు సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణను మించిన సంపద లేదు. ప్రస్తుత కరోనా సమయంలో ఈ విషయం రుజువైంది. స్వచ్ఛమైన ప్రాణ వాయువు దొరక్క పరితపిస్తున్న దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఆరోగ్య సంపదను మించిన సంపద లేదు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. నాసిరకం ప్లాస్టిక్ వాడకం మీద నియంత్రణ విధించాం. గ్రీన్ కవర్ పెంచే హరితహారం వంటి పలు పథకాలు అమలు చేస్తున్నాం అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

కరోనా థర్డ్ వేవ్ ముప్పుతో తెలంగాణ సర్కారు అప్రమత్తం

హైదరాబాద్ , జూన్ 4:దేశంలో కరోనా రెండో వేవ్ విజృంభణ ఇంకా ఆగలేదు. ఇంతలోనే మూడో వేవ్ రానుందని నిపుణులు నివేదికలు ఇస్తున్నారు. అంతేకాకుండా ఈ మూడో వేవ్‌లో చిన్నారులకు ఎక్కువ ప్రమాదమని తెలిపారు.

దీంతో కరోనా థర్డ్ వేవ్ ప్రజల గుండెల్లో గుబులు రేపుతుంది. తమ పిల్లలను ఎలా కాపాడుకోవాలని అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయంలో నిపుణులు కూడా ప్రభుత్వానికి అనేక సూచనలు చేస్తున్నారు. థర్డ్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుండే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అందుకు అనుగుణంగా తెలంగాణ సర్కారు ఈ ముప్పును ఎదుర్కోవడంపై దృష్టిపెట్టింది.

రాష్ట్రంలో దాదాపు 30 లక్షలమంది చిన్నారులు కరోనా వైరస్ బారినపడే ప్రమాదముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వీరిలో సుమారు 6-8 వేల మంది వరకూ ఐసీయూలో చికిత్స పొందే అవకాశం ఉండవచ్చని కూడా వారు అభిప్రాయపడుతున్నారు. ఇందులోనూ 1 శాతంమంది చిన్నారుల్లో ప్రమాదకరమైన 'మల్టీ సిస్టం ఇన్‌ఫ్లమేటరీ సిండ్రోమ్ (ఎంఐఎస్-సి)' ముప్పు పొంచి ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో సర్కారు దీనిని ఎదుర్కొనేందుకు అన్ని రకాలుగానూ సన్నాహాలు చేపట్టింది. దీనిపై ఇటీవల వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, కొవిడ్ నిపుణుల కమిటీ సమావేశమై.. ముందస్తు సన్నాహాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా చిన్నపిల్లలకు చికిత్స అందించేందుకు 5 వేల పడకలను సిద్ధం చేస్తున్నారు. వాటిలో 10 ఐసీయూ వెంటిలేటర్ పడకలుంటాయి. అంతేకాకుండా వారికి కావలసిన అన్ని రకాల ఔషధాల కొరతను నివారించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారు. వైద్యుల కొరతను కూడా నిలువరించే విధంగా పోస్టులను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

సీసీ కెమెరాలను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, జూన్ 4:ఐకమత్యంతో పట్టణాలు, గ్రామాలలో అభివృద్ధి సాధ్యమని ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పాలకొండలో రూ. 3 లక్షల 80 వేల వ్యయంతో గ్రామంలో ఏర్పాటు చేసిన సీ.సీ కెమెరాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ.. జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. ఒకప్పుడు పాలకొండ గ్రామాన్ని ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడచిన 7 ఏళ్లలో పాలకొండలో పెన్షన్ల కిందనే సుమారుగా 10 కోట్ల రూపాయలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అంతేకాక కల్యాణలక్ష్మి, రైతు బంధు, రైతు బీమా, వంటి పథకాల కింద రైతులు, ఇతర వర్గాలకు సహకారం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. బైపాస్ రోడ్డు పూర్తిచేయడం, నూతన కలెక్టర్ కార్యాలయ భవనం పూర్తయిన వెంటనే పాలకొండ దశ మారుతుందని మంత్రి అన్నారు. గ్రామంలో అర్హులైన వారందరికీ పెన్షన్ల తో పాటు అన్ని పథకాలను అమలు చేస్తున్నామని, వాటన్నింటినీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా మంత్రి విజ్ఞప్తి చేశారు.

సీసీ కెమెరాలను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్

ముఖ్యంగా పాలకొండ ప్రజలు ఐకమత్యంగా ఉండాలని దానివల్ల గ్రామాలు, పట్టణాలు త్వరితగతిన అభివృద్ధి సాధించడానికి వీలవుతుందని మంత్రి అన్నారు. గ్రామంలో సి.సి కెమెరాల ఏర్పాటుతో నిఘా వ్యవస్థ పటిష్టమవుతుందన్నారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ నరేందర్, సీఐ మహేశ్వరరావు, ఎస్ఐ రమేష్, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులపై కరోనా ప్రభావం పెద్దగా ఉండదు: డబ్ల్యూహెచ్‌ఓ

కరోనా వైరస్ ఇప్పుడు పిల్లలపైనా ప్రభావం చూపుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (చిఉఆ) కీలక వ్యాఖ్యలు చేసింది. చిఉఆ వ్యాక్సిన్ నిపుణురాలు కేట్ ఓబ్రైన్ స్పందిస్తూ? చిన్నారులపై కరోనా వైరస్ ప్రాణాంతక ప్రభావమేమీ చూపదని అన్నారు. దీని గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. పిల్లలకు కరోనా వ్యాక్సినేషన్ ప్రాధాన్యతాంశం కాదని పేర్కొన్నారు. పిల్లలకు వైరస్ సోకినా అంతంతమాత్రమే ప్రభావం చూపుతుందని తెలిసినప్పుడు వ్యాక్సినేషన్ ఎందుకని కేట్ ఓబ్రైన్ వ్యాఖ్యానించారు. పిల్లలను పాఠశాలలకు పంపేముందు వ్యాక్సినేషన్ చేయడం అత్యవసరమేమీ కాదని, పిల్లలకు బదులు, ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి వ్యాక్సిన్ ఇవ్వడం మంచి ఆలోచన అవుతుందని వివరించారు. కాగా, పిల్లలకు ఇచ్చే టీకాలను పేద దేశాలకు ఇవ్వాలని చిఉఆ చీఫ్ టెడ్రోస్ అథనోమ్ అభిప్రాయపడ్డారు. పలు దేశాల్లో 12 నుంచి 18 ఏళ్ల లోపు వారికి కూడా వ్యాక్సిన్లు ఇస్తుండడం పట్ల ఆయన పై విధంగా స్పందించారు.

చరిత్రలో నేటినిజం

కం॥ మీ కుటుంబము మరియు మీ కులములో
చెక్కిన శిల్పములు వారె సత్ఫలమునన్
చదివిన కవితలుగ నుదువు
"సకల అబుబప్పు కిడెద సదశతచయమున్"!!

-రాధశ్రీ

(జూన్ 5 ప్రముఖ కవయిత్రి సక్కా అరుణ జననం..)

సెల్: 9494481210

రూ.43000 కోట్లతో ఆరు సబ్‌మెరైన్ల నిర్మాణానికి ఆమోదం

న్యూఢిల్లీ, జూన్ 4: అత్యాధునిక సబ్‌మెరైన్లను నిర్మించేందుకు భారత్ సన్నద్ధమైంది. భారతీయ నేవీ కోసం ఆరు జలాంతర్గాములను నిర్మించేందుకు రక్షణశాఖ సుమారు రూ.43000 కోట్లు కేటాయించింది. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ భేటీలో సబ్‌మెరైన్ల ప్రాజెక్టుకు ఆమోదం దక్కింది. స్వదేశీయంగా సబ్‌మెరైన్లను నిర్మించేందుకు త్వరలోనే ప్రతిపాదనలను జారీ చేయనున్నట్లు అధికార వర్గాల ద్వారా వెల్లడైంది.

మజగాన్ డాక్స్(ఎండీఎల్), లార్సెన్ అండ్ టర్బో(ఎల్‌అండ్‌టీ) సంస్థలకు రక్షణశాఖ ప్రతిపాదనల రిక్వెస్ట్ పంపింది. ప్రాజెక్ట్-75 ఇండియా కింద ఆరు డీజిల్-ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్లను నిర్మించనున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న స్కార్పీన్ క్లాస్ సబ్‌మెరైన్ల కన్నా పెద్ద సైజులో ఉండనున్నాయి. జలాంతర్గాములో అత్యంత శక్తివంతమైన ఆయుధాలను అమర్చనున్నారు. 12 ల్యాండ్ అటాక్ క్రూయిజ్ మిస్సైల్స్ ఉండనున్నాయి. యాంటీ షిప్ క్రూయిజ్ మిస్సైళ్లను కూడా వాడనున్నారు. సుమారు 18 హెవీవెయిట్ టార్పిడోలను మోసుకువెళ్లే విధంగా సబ్‌మెరైన్లు ఉండాలని ఇప్పటికే నేవీకి సూచనలు చేశారు. ప్రస్తుతం భారతీయ నేవీ వద్ద 12 సబ్‌మెరైన్లు ఉన్నాయి. దీంతో పాటు ఐఎన్ఎస్ హరిహంత్, ఐఎన్ఎస్ చక్ర లాంటి న్యూక్లియర్ సబ్‌మెరైన్లు కూడా ఉన్నాయి.

పారిశుద్ధ్య కార్మికులకు మేయర్ విజయలక్ష్మి హెల్త్ కిట్ల పంపిణీ

హైదరాబాద్ , జూన్ 4: రూ. కోటి విలువైన హెల్త్ కిట్లను హైదరా బాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో 2,374 మంది కార్మికులకు రూ.4,133 విలువ గల హెల్త్ కిట్‌ను అందజేశారు. మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి కిట్‌లో ఉద్యోగులకు ఉపయోగపడే మాస్కులు, శానిటైజర్లు, సబ్బులు, బూట్లు, రెయిన్‌కోట్లు మొదలైన 11 రకాల వస్తువులు ఉన్నట్లు మేయర్ చెప్పారు. జీహెచ్ఎంసీలోని 5 వేల మంది కార్మికులందరికి ఈ హెల్త్ కిట్లను అందజేయనున్నట్లు వెల్లడించారు.

తెలంగాణలో రాగల మూడురోజులు వర్షాలు

హైదరాబాద్ , జూన్ 4:తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. పలు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. "ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనపడింది. తెలంగాణ నుంచి దక్షిణ తమిళనాడు వరకు ఆవరించిన ద్రోణి బలహీనపడింది. నైరుతి దిశ నుంచి రాష్ట్రంలోకి కిందస్థాయి గాలులు వీస్తున్నాయి" అని వాతావరణశాఖ వెల్లడించింది. రాగల 2,3 రోజుల్లో దక్షిణ తెలంగాణ జిల్లాల్లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశముందని పేర్కొంది.

కీలక వడ్డీ రేట్లలో మార్పులు చేయని ఆర్బీఐ

న్యూఢిల్లీ, జూన్ 4: రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ద్రవ్యపరపతి విధాన సమీక్షలో కీలక వడ్డీ రేట్లను అలాగే ఉంచింది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ). దీంతో రెపో రేటు 4 శాతంగా, రివర్స్ రెపో రేటు 3.35 శాతంగా కొనసాగనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం ప్రకటించారు. ఇక మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటు, బ్యాంకు రేట్లు కూడా శాతంగా కొనసాగనున్నాయి. మరోవైపు 2022 సంవత్సరానికిగాను జీడీపీ వృద్ధి రేటు అంచనాను శాతానికి తగ్గించింది. గతంలో ఇది 10.5 శాతంగా ఉంటుంది ఆర్బీఐ అంచనా వేసింది. ఇక తొలి త్రైమాసికం జీడీపీ వృద్ధి రేటును గతంలో 26.2 శాతంగా అంచనా వేసినా.. తాజాగా దానిని 18.5 శాతానికి తగ్గించింది.

ఏపీలో కొత్తగా 10,413 కరోనా కేసులు

అమరావతి, జూన్ 4:ఆంధ్రప్రదేశ్‌లో కరోనా ఉధృతి కొనసాగుతోంది. గడచిన 24గంటల్లో 85,311 శాంపిల్స్ పరీక్షించగా మరో 10,413 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. 24 గంటల్లో కొవిడ్ బారినపడి శుక్రవారం 83 మంది ప్రాణాలు కోల్పోగా 15,469 మంది డిశ్చార్జ్ అయ్యారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 1738990కు చేరింది. ప్రస్తుతం 133773 యాక్టివ్ కేసులున్నాయి. 1593921 యాక్టివ్ కేసులున్నాయి. 11296కు పెరిగింది.

సిఎస్ఐఆర్ సొసైటీ సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 4:కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఎండ్ ఇండస్ట్రియల్ రిసర్చ్ (సిఎస్ఐఆర్) సమావేశానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా అధ్యక్షత వహించారు.

ఈ సందర్భం లో ప్రధాన మంత్రి మాట్లాడుతూ, కరోనా మహమ్మారి ఈ శతాబ్ది లో అతి పెద్ద సవాలు గా నిలచిందని వ్యాఖ్యానించారు. అయితే గత కాలం లో మానవాళి కి ఒక భారీ సంకటం ఎదురైనపుడల్లా విజ్ఞాన శాస్త్రం ఓ మెరుగైన దారి ని సిద్ధపరచిందని ఆయన అన్నారు. పరిష్కారాల ను కనుగొనడం, సంకట కాలాల్లో వీలుపడే కార్యాల కు నడుం బిగించడం ద్వారా కొత్త బలాన్ని జోడించడమనేది విజ్ఞాన శాస్త్రం మౌలిక స్వభావం అని కూడా ఆయన అన్నారు.

ప్రపంచ వ్యాప్త వ్యాధి బారి నుంచి మానవ జాతి ని రక్షించడం కోసం టీకా మందుల ను ఒక సంవత్సరం లోపే శరవేగం గా, పెద్ద ఎత్తు న తయారు చేసినందుకు శాస్త్రవేత్తల ను ప్రధాన మంత్రి పొగడారు. చరిత్ర లో అటువంటి ఒక పెద్ద ఘటన జరగడం ఇది ఒకటో సారి అని ఆయన అన్నారు. కిందటి శతాబ్దం లో నూతన ఆవిష్కరణ లు ఇతర దేశాల లో చోటు చేసుకొన్నాయి, భారతదేశం చాలా సంవత్సరాల పాటు వేచివుండవలసి వచ్చింది అని కూడా ఆయన అన్నారు. అయితే ప్రస్తుతం మన దేశం లోని శాస్త్రజ్ఞులు ఒకే రకమైనటువంటి వేగం తోను, ఇతర దేశాల తో సమానం గాను శ్రమిస్తున్నారని ఆయన చెప్పారు. కరోనా కు వ్యతిరేకం గా సాగుతున్నటువంటి పోరు లో కోవిడ్-19 టీకా మందుల విషయం లో, టెస్టింగ్ కిట్స్ విషయం లో, అవసరమైనటువంటి సామగ్రి విషయం లో, సరికొత్త ప్రభావకారి ఔషధాల విషయం లో భారతదేశాన్ని సొంత కాళ్ల మీద నిలబడేటట్టు చేసిన శాస్త్రవేత్తల ను ఆయన ప్రశంసించారు. విజ్ఞాన శాస్త్రాన్ని, సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి చెందిన దేశాల తో సమాన స్థాయి కి తీసుకు రావడం ఇటు పరిశ్రమ కు, అటు బజారు కు శ్రేష్ఠతరం గా ఉంటుంది అని ఆయన అన్నారు. మన దేశం లో, విజ్ఞాన శాస్త్రాన్ని, సమాజాన్ని, పరిశ్రమ ను ఒకే స్థాయి లో ఉంచే ఒక సంస్థాగత సర్దుబాటు వ్యవస్థ గా సిఎస్ఐఆర్ పాటుపడుతోందని ప్రధాన మంత్రి అన్నారు. శాంతి స్వరూప భట్ నాగర్ వంటి ఎంతో మంది ప్రతిభావంతులను, శాస్త్రవేత్తల ను మన ఈ సంస్థ అందించింది, శాంతి స్వరూప్ భట్ నాగర్ ఈ సంస్థ కు నాయకత్వం వహించారు అని ప్రధాన మంత్రి చెప్పారు. పరిశోధన, పేటెంట్ ల ఇకోసిస్టమ్ తాలూకు ఒక శక్తిమంతమైనటువంటి జత సిఎస్ఐఆర్ కు ఉంది అని ఆయన తెలిపారు. దేశం ఎదుర్కొంటున్నటువంటి అనేక సమస్యల ను పరిష్కరించడం కోసం సిఎస్ఐఆర్ కృషి చేస్తోందని ఆయన అన్నారు.

దేశం తాలూకు ప్రస్తుత లక్ష్యాలు, 21వ శతాబ్దం తాలూకు దేశవాసుల కల లు ఒక పునాది మీద ఆధారపడి ఉన్నాయి అని ప్రధాన మంత్రి అన్నారు. కాబట్టి సిఎస్ఐఆర్ వంటి సంస్థ ల లక్ష్యాలు కూడా అసాధారణమైనవే అని ఆయన అన్నారు. బయో టెక్నాలజీ మొదలుకొని బ్యాటరీ సాంకేతికత ల వరకు, వ్యవసాయం మొదలుకొని ఖగోళశాస్త్రం వరకు, విపత్తుల నిర్వహణ మొదలుకొని రక్షణ సంబంధి సాంకేతిక విజ్ఞానం వరకు, వ్యాక్సీన్ ల మొదలుకొని వర్చువల్ రియాలిటి వరకు.. ప్రతి ఒక్క రంగం లో.. స్వయంసమృద్ధియుతమైంది గా రూపుదిద్దుకోవాలని నేటి భారతదేశం కోరుకొంటోంది అని ఆయన అన్నారు. ప్రస్తుతం భారతదేశం సుస్థిర అభివృద్ధి, శుద్ధ శక్తి రంగం లో ప్రపంచానికి దారి ని చూపుతోంది అని కూడా ఆయన అన్నారు. ప్రస్తుతం సాఫ్ట్ వేర్ మొదలుకొని ఉపగ్రహాల వరకు ఇతర దేశాల అభివృద్ధి వేగాన్ని భారతదేశం పెంచుతోంది, ప్రపంచ అభివృద్ధి లో ఒక ప్రధాన యంత్రం పాత్ర ను పోషిస్తోంది అని ఆయన చెప్పారు. ఈ కారణం గా, భారతదేశం లక్ష్యాలు ఈ దశాబ్దం అవసరాల తో పాటు తరువాతి దశాబ్ది అవసరాలకు కూడా అనుగుణం గా ఉండాలి అని ఆయన అన్నారు.

జలవాయు పరివర్తన ను గురించి ప్రపంచవ్యాప్త నిపుణులు అదే పని గా భయాన్ని వ్యక్తం చేస్తున్నారని ప్రధాన మంత్రి అన్నారు. శాస్త్రీయ దృష్టికోణం తో సన్నాహాల ను చేయవలసింది గా శాస్త్రవేత్తల కు, సంస్థల కు ఆయన పిలుపునిచ్చారు. కార్బన్ కేప్చర్ మొదలుకొని శక్తి ని నిలవ చేయడం నుంచి హరిత ఉదజని సాంకేతికత ల దా?కా ప్రతి ఒక్క రంగం లోనూ అందరి కన్నా ముందు నడవండి అని వారిని ఆయన కోరారు. సమాజాన్ని, పరిశ్రమ ను వెంట బెట్టుకొని సాగవలసిందిగా సిఎస్ఐఆర్ కు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన ఇచ్చిన సలహా ను అనుసరించి ప్రజల వద్ద నుంచి సూచనలను, ఆలోచనల ను తీసుకోవడం మొదలుపెట్టినందుకు గాను సిఎస్ఐఆర్ ను ప్రధాన మంత్రి ప్రశంసించారు. 2016వ సంవత్సరం లో ప్రారంభించిన అరోమ మిశన్ లో సిఎస్ఐఆర్ పోషించిన పాత్ర ను ఆయన కొనియాడారు. ప్రస్తుతం దేశం లో వేల కొద్దీ రైతులు పూల మొక్కల పెంపకం ద్వారా వారి భాగ్యరేఖల ను మార్చివేసుకొంటున్నారు అని ఆయన చెప్పారు. భారతదేశం ఇంగువ కోసం దిగుమతుల పై ఆధారపడేదని, దేశం లో ఇంగువ సేద్యం లో సాయపడినందుకు సిఎస్ఐఆర్ ను ఆయన ప్రశంసించారు.

ఒక మార్గ సూచీ దన్ను తో సరైన మార్గం లో ముందుకు సాగిపోవలసింది గా సిఎస్ఐఆర్ ను ప్రధాన మంత్రి కోరారు. కరోనా తాలూకు ప్రస్తుత కోవిడ్-19 సంకటం అభివృద్ధి గమనం పైన ప్రభావాన్ని చూపివుండవచ్చు గాని ఆత్మనిర్భర్ భారత్ (స్వయంసమృద్ధియుత భారత్) ను ఆవిష్కరించాలి అనే కల ను నెరవేర్చుకోవాలన్న వచనబద్ధత స్థిరం గానే ఉంది అని ఆయన అన్నారు. మన దేశం లో లభిస్తున్నటువంటి అవకాశాల ను అనుకూలం గా వినియోగించుకోవాలి అంటూ ఆయన పిలుపునిచ్చారు. మన ఎమ్ఎస్ఎఇ లకు, స్టార్ట్ అప్స్ కు వ్యవసాయ రంగం మొదలుకొని విద్య రంగం వరకు ప్రతి ఒక్క రంగం లో గొప్ప కార్యక్షమత కు ఆస్కారం ఉందని ఆయన తెలిపారు. కోవిడ్ సంక్షోభం కాలం లో ప్రతి రంగం లోనూ సాధించిన సాఫల్యాన్ని తిరిగి సాధించవలసిందంటూ శాస్త్రవేత్తలందరికీ, పరిశ్రమ కు ఆయన విజ్ఞప్తి చేశారు.

టిమ్స్‌లో 150 ఐసీయూ బెడ్స్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్ , జూన్ 4:గచ్చిబౌలి టిమ్స్‌ను రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శుక్రవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా హైసియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 150 ఐసీయూ బెడ్స్‌ను ప్రారంభించారు. అనంతరం కరోనా వార్డులను కేటీఆర్ కలియతిరిగారు. కరోనా బాధితులను పరామర్శించి.. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే 1200 బెడ్స్‌తో కరోనా రోగులకు సేవలు అందుతున్నాయి. కొత్తగా ప్రారంభించిన 150 పడకలను రూ. 15 కోట్లతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైసియా సభ్యులకు కేటీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. ప్రస్తుత లాక్‌డౌన్ ముగిసే లోగా రెండో దశ తీవ్రత తగ్గే అవకాశం ఉందన్నారు. మళ్లీ సాధారణ జీవనం గడిపే అవకాశాలు ఉన్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు అని తెలిపారు. కరోనా విజృంభించినప్పటి నుంచి విరామం లేకుండా వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇంటింటి సర్వే ద్వారా నివారణ చర్యలు చేపట్టామన్నారు. సూపర్ స్ప్రెడర్లకు ప్రాధాన్యతా క్రమంలో టీకాలు ఇస్తున్నామని తెలిపారు. ప్రపంచానికే వ్యాక్సిన్ రాజధానిగా ఉన్నామని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్రం అనాలోచిత నిర్ణయాల వల్ల మందకొడిగా వ్యాక్సినేషన్ జరుగుతుందన్నారు. విదేశాల్లో 50 కోట్ల ఆస్ట్రాజెనికా డోసులు నిరూపయోగంగా ఉన్నాయన్నారు. టీకాలు కొనకుండా ఇతర దేశాలకు ఎగుమతి చేశారు. పావలా శాతం టీకాలు లేకుండా ఎగుమతి చేపట్టారు. ఇకనైనా కేంద్రం మేల్కొని విదేశాల్లోని టీకాలు తెప్పించాలని సూచించారు. టిమ్స్‌లో నెలకొన్న సమస్యలతో పాటు వైద్యుల సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో విపత్తు నుంచి బయటపడుతామని కేటీఆర్ పేర్కొన్నారు.

పార్టీకి, ఎమ్మెల్యే పదవికి ఈటెల రాజీనామా

నేను లౌకిక వాదిని.. బీజేపీలోకి ఎందుకు వెళ్తున్నానంటే..

హైదరాబాద్ , జూన్ 4:టీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన తర్వాత మాజీ మంత్రి ఈటల రాజేందర్ మీడియాతో చిట్ చాట్ సందర్భంగా తన రాజకీయ భవిష్యత్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో చేరికపై స్పష్టత ఇచ్చారు. వచ్చే వారం ఢిల్లీలో బీజేపీలో చేరుతానని ఈటల రాజేందర్ ప్రకటించారు. "నాది లెఫ్ట్ భావజాలమైనా ప్రస్తుత పరిస్థితులు బీజేపీ వైపు నడిపించాయి. ఢిల్లీలో బీజేపీ నేతలందరినీ కలిశా. అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడాను. వారం రోజుల తర్వాత బీజేపీలో చేరిక ఉంటుంది. నేను బీజేపీలో చేరిన తర్వాత చాలా మంది ఉద్యమకారులు బీజేపీలోకి వస్తారు. బీజేపీ అగ్రనేతల సమావేశంలో టీఆర్ఎస్ తో సంబంధాల గురించే మొదటగా ప్రస్తావించా. టీఆర్ఎస్ లో తన కంటే ఎంతో మంది ఎక్కువ అవమానాలకు గురయ్యారు. పరిస్థితులు చక్కబడ్డాక బహిరంగ సభ నిర్వహిస్తాం. స్పీకర్ సమయం ఇస్తే నేరుగా కలిసి రాజీనామా లేఖను అందజేస్తా. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నన్ను ఓడించేందుకు టిఆర్ఎస్ ప్రయత్నించింది. ఇప్పటికే హుజురాబాద్ నియోజవర్గంలో టిఆర్ఎస్ రూ.50 కోట్లు ఖర్చు పెట్టింది" అని ఈటల రాజేందర్ అన్నారు.

కాగా, ఈటల రాజేందర్‌తో పాటు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్, కరీంనగర్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తులా ఉమ, మరికొందరు నేతలు కాషాయ తీర్థం పుచ్చుకోనున్నారు.

అది ప్రగతిభవన్ కాదు.. బానిస భవన్: ఈటల

ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ప్రగతిభవన్ కాదు బానిస భవన్ అని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. బానిస కంటే అధ్వాన్నంగా ఉన్న మంత్రి పదవి ఎందుకని ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రిని కలవడానికి నేను గతంలో తొమ్మిది మంది ఎమ్మెల్యేలతో కలిసి వెళితే గేటు వద్దే మమ్మల్ని ఆపేశారు. ఈ విషయం మీడియాకు తెలిస్తే మా పరువు పోతుందని వారికి చెప్పాం. రెండోసారి అపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్లాము. అప్పుడు కూడా గేటు వద్ద నుంచే వెనుదిరిగాము. బానిస కంటే నీచంగా మంత్రి పదవి ఉంది. ఎంపీ సంతోష్ కుమార్ తో నేను అప్పట్లో చెప్పాను. దీనికి ప్రగతి భవన్ అని కాకుండా బానిసల నిలయం అని పేరు పెట్టుకోవాలని అన్నాను' అని ఈటల రాజేందర్ తెలిపారు."విజయశాంతి, ఆలె నరేందర్, కోదండరామ్‌ను కూడా ఇలాగే బయటకు పంపించారు. ఈ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎందుకు అన్నది సీఎం కేసీఆర్ భావన. మంత్రులు ఎవరూ స్వేచ్ఛగా చేయలేరు. ఐఏఎస్ అధికారులు కూడా బాధతోనే పనిచేస్తున్నారు. నేటికి సీఎంవోలో ఒక్క ఎస్సీ, ఎస్టీ, బీసీ ఐఏఎస్ లేరు" అని ఈటల తెలిపారు. సంక్షేమ పథకాలను వ్యతిరేకించానని తనమీద ఆరోపణలు చేశారని అన్నారు. తాను సంక్షేమ పథకాలను వద్దనలేదని, కానీ, రైతు బంధు పథకం కింద ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారికి నగదు సహాయం ఇవ్వొద్దని చెప్పానని అది తప్పా? అని నిలదీశారు. "బెంజి కారులో వచ్చి లక్షలు లక్షలు తీసుకుని పోయే వాళ్లను చూస్తే పేద రైతుల పరిస్థితి ఎలా ఉంటుందని అడిగాను. ఉద్యమానికి ప్రజా సంఘాలు అండగా నిలబడ్డాయి. ధర్నా చౌక్ వేదికగా నిలిచింది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇందిరా పార్క్‌లో ఎన్నో ఉద్యమాలు చేశాం. కానీ ఇప్పుడు ధర్నాచౌక్‌ను ఎత్తేసిన చరిత్ర వాళ్లది. ఇవన్నింటినీ మేం అడగకూడదా? ఇంత అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించకూడదా? ఆనాడు సంఘాలు కావాలి.. ఇప్పుడు అక్కర్లేదా?" అని ఈటల ప్రశ్నించారు.

వైద్య మంత్రి లేకుండానే సమీక్షలు చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే..రెండు నెలల వరకూ పట్టించుకోలేదని విమర్శించారు. బొగ్గ గని కార్మిక సంఘంలో ఆ సంఘానిక

భారత్ కు అమెరికా వ్యాక్సిన్ సాయం..

న్యూఢిల్లీ, జూన్ 3కరోనా వ్యాక్సిన్ల విషయంలో ఆసియా, ఆఫ్రికా దేశాలకు అండగా నిలవాలని అగ్రరాజ్యం అమెరికా నిర్ణయించింది. ఈ మేరకు ఇతర దేశాలతో వ్యాక్సిన్ షేరింగ్ విధానాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. ఇందులో భారత్, మెక్సికో, కెనడా, దక్షిణ కొరియా ఉన్నాయి. ఇందులో భాగంగా భారత్‌కు అందించనున్న వ్యాక్సిన్ల గురించి అమెరికా అధ్యక్షురాలు కమలా హ్యారిస్.. ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా అమెరికా నిర్ణయంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. కరోనా నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం, అక్కడి వ్యాపారవర్గాలు, అమెరికాలోని భారతీయులు భారత్‌కు మద్దతుగా నిలవడంపై మోదీ ధన్యవాదాలు తెలిపారు. అమెరికా విధానాన్ని ప్రకటిస్తూ.. వివిధ దేశాల కంపెనీలు కలిసి వ్యాక్సిన్లు ఉత్పత్తి చేయడానికి అవరోధంగా తయారైన మేధో సంపత్తి హక్కుల నిబంధనలను కూడా ఎత్తివేయనున్నట్టు జో బైడెన్ తెలిపారు. ఈ నెలాఖరుకు మొత్తం 8 కోట్ల వ్యాక్సిన్ డోసులను వివిధ దేశాలకు సరఫరా చేయనున్నట్టు పేర్కొన్నారు. మొదటి విడతగా 2.5కోట్ల వ్యాక్సిన్ డోసులను కరోనా తీవ్రత ఎక్కువగా ఉన్న దేశాలకు సరఫరా చేయాలని నిర్ణయం తీసుకొంది.

ఏపీ సమాచార కమీషనర్ల ప్రమాణం

అమరావతి, జూన్ 4:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమీషన్ కమిషనర్లుగా నియామితులైన ఉల్చల హరిప్రసాద్ రెడ్డి,కాకర్ల చెన్నారెడ్డిలు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యా నాథ్ దాస్ వారితో ప్రమాణం చేయించారు. శుక్రవారం అమరావతి సచివాలయం మొదటి భవనం సియం సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇరువురు నూతన కమీషనర్లకు సీఎస్ పుష్పగుచ్చాలను అందించి ప్రభుత్వం తరుపున సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం మరింత పటిష్టవంతంగా అమలు జరిగేలా నూతన కమీషనర్లు తమవంతు కృషి చేయాలని సీఎస్ ఆదిత్యా నాథ్ దాస్ ఆకాంక్షించారు. సమాచార హక్కు చట్టం ప్రజలకు ఒక వరం వంటిదని వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం అమలుపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేందుకు సమాచార కమీషనర్లు అన్ని విధాలా కృషి చేయాల్సిన అవసరం ఉందని సిఎస్ ఆదిత్యానాద్ దాస్ పేర్కొన్నారు.

అమూల్ ప్రాజెక్ట్ లో వాటాదారులు పాడిరైతులే: సీఎం

అమరావతి, జూన్ 4:పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఏపీ?అమూల్ పాల వెల్లువ ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం చేపట్టింది. పశ్చిమ గోదావరి జిల్లాలో పాల సేకరణ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ శుక్రవారం తన క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ అమూల్ ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించబోతారని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో జగనన్న పాల వెల్లువకు శ్రీకారం చుట్టామన్నారు. పాదయాత్రలో పాల రైతుల కష్టాలు చూశానని, లీటర్ పాల ధర కంటే లీటర్ నీళ్ల ధరే ఎక్కువ ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు పాడి రైతుల కోసం అమూల్ ప్రాజెక్ట్‌ను తీసుకొచ్చామన్నారు. అమూల్ సంస్థలో వాటాదారులంతా పాలు పోసే అక్కాచెల్లెమ్మలేనని తెలిపారు. పాలసేకరణలో చెల్లించే ధరలు.. మిగిలిన సంస్థల కంటే అమూల్ సంస్థలో ఎక్కువ అని, అమూల్ ద్వారా పాడిరైతులకు మంచి లాభాలు వస్తున్నాయని చెప్పారు.

ఇప్పటికే చిత్తూరు, ప్రకాశం, గుంటూరు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో పాల సేకరణ జరుగుతోందన్నారు. ఇవాళ్టి నుంచి పశ్చిమగోదావరి జిల్లాలోని 153 గ్రామాల్లో అమూల్ సంస్థ పాలసేకరణ చేస్తుందన్నారు. రాష్ట్రంలో 9,899 గ్రామాలకు అమూల్‌ను విస్తరిస్తామని సీఎం వెల్లడించారు. లీటర్‌కు అదనంగా రూ.5 నుంచి రూ.15 వరకు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. పాడి రైతులకు 10 రోజులకు ఒకేసారి బిల్లు చెల్లింపులు ఉంటాయని సీఎం తెలిపారు.

టీటీడీ అధికారులు తప్పులపై తప్పులు చేస్తున్నారు: గోవిందానంద సరస్వతి

అమరావతి, జూన్ 4:హనుమంతుడి జన్మస్థలంపై టీటీడీ చెప్పిన మాటలు పూర్తిగా అవాస్తవమని హనుమత్ జన్మతీర్థ ట్రస్ట్ వ్యవస్థాపకులు గోవిందానంద సరస్వతి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చాలా హడావుడిగా టీటీడీ ప్రకటనను వెలువరించిందని విమర్శించారు. వారు చెపుతున్న మాటలు నమ్మదగినవి కాదని అన్నారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు టీటీడీ అధికారులు తప్పులపై తప్పులు చేస్తున్నారని చెప్పారు. తొలుత జపాలి తీర్థంలో హనుమంతుడు పుట్టాడని చెప్పారని? ఆ తర్వాత ఆకాశగంగ ప్రాంతంలో పుట్టాడని చెప్పారని? క్షణానికి ఒక మాట మార్చడం క్షమించలేని విషయమన్నారు.

టీటీడీ ఇప్పటికైనా శంకర, మధ్వ, రామానుజ తీర్థ మఠాల పెద్దలను సంప్రదించాలని గోవిందానంద సూచించారు. ఈ అంశంపై విశాఖ శారదాపీఠం సలహాలు ఇస్తోందనే వార్తలపై ఆయన స్పందిస్తూ? ఆ పీఠం ఒక డూప్లికేట్ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఏపీ సీఎం మద్దతు ఉన్నంత మాత్రాన విశాఖ పీఠం శంకర పీఠం అవుతుందా? అని మండిపడ్డారు. దక్షిణ భారతంలో తప్పుడు పీఠాలు ఉన్నాయని? ఇలాంటి పీఠాలను ఉత్తరాదిలో తరిమికొడతారని అన్నారు. శృంగేరి, బద్రి, ద్వారక, పూరి, కంచి పీఠాలు మాత్రమే శంకర పీఠాలని చెప్పారు. సన్యాసులు రాజకీయాల్లోకి రాకూడదన్నారు. టీటీడీ ప్రచురించిన పుస్తకంలో పేర్కొన్న హనుమాన్ జయంతికి, ఇప్పుడే నిర్వహిస్తున్న తేదీలకు పొంతనే లేదని గోవిందానంద విమర్శలు గుప్పించారు. హనుమంతుడి జన్మస్థలం గురించి టీటీడీ రాత్రికి రాత్రే కలగనిందా? అని ప్రశ్నించారు. టీటీడీ తప్పు చేసిందని, ఇప్పటికైనా అహంకారాన్ని వదలాలని.. లేకపోతే పరువు పోతుందని హెచ్చరించారు. తప్పు ఒప్పుకుంటే పరువు పోతుందని టీటీడీ అధికారులు తప్పు మీద తప్పు చేస్తున్నారని అన్నారు. నిజాలను చెప్పకుండా టీటీడీ భక్తులను తప్పుదోవ పట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారతీయ నావికాదళం & భారతీయ కోస్ట్ గార్డ్ కోసం 11 విమానాశ్రయాల నిఘా రాడార్ల కొనుగోలుకు ఒప్పందంపై సంతకం చేసిన రక్షణ శాఖ

న్యూఢిల్లీ, జూన్ 4:న్యూఢిల్లీ, జూన్ 3 (పిఐబి)ః భారతీయ నావికాదళం, భారతీయ కోస్ట్‌గార్డ్ కోసం నిక్షిప్తమైన ప్రత్యక్ష సమాచారాన్ని అందించగల 11 మోనోపల్స్ సెకెండరీ నిఘా రాడార్ కలిగిన విమానాశ్రయ నిఘా రాడార్ల కొనుగోలు కోసం ఎం/ఎస్ టెలి ఫోనిక్ ఇంటిగ్రేటెడ్ సిస్టంస్ లిమిటెడ్, ముంబైతో రక్షణ మంత్రిత్వ శాఖ 03 జూన్ 2021న ఒప్పందంపై సంతకాలు చేసింది. రూ.323.47 కోట్ల విలువైన ఈ కొనుగోలు బై అండ్ మేక్ శ్రేణి కింద చేస్తున్నారు. ఈ రాడార్ల సంస్థాపన విమానాశ్రయాల చుట్టూ వైమానిక పరిధి గురించిన అవగాహనను పెంచడమే కాక, భారతీయ నావికాదళం, భారతీయ కోస్ట్‌గార్డ్ వైమానిక కార్యకలాపాల సామర్థ్యాన్ని, భద్రతను పెంచుతుంది.

ఆత్మనిర్భర్ భారత్ అభియాన్, ఆ కార్యక్రమంలో పొందుపరిచిన లక్ష్యాల దిశగా ప్రభుత్వ సాధించిన విజయానికి ఈ ఒప్పందం ఒక సంకేతం. ఇది సాంకేతిక పరిజ్ఞానాన్నిగ్రహించడానికి, నైపుణ్యాల అభివృద్ధి, దేశీయ ఉత్పత్తి, ఉపాధి అవకాశాల పెరుగుదలకు ఇది సాధికారికతను ఇస్తుంది.

టీకా శిబిరాలను నిర్వహిస్తున్న పవర్‌గ్రిడ్

న్యూఢిల్లీ, జూన్ 4:(పిఐబి)ః విద్యుత్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని మహారత్న ప్రభుత్వ రంగ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పవర్‌గ్రిడ్). ప్రస్తుత మహమ్మారి కాలంలో జీవితాలను కాపాడేందుకు అత్యంత కీలకమైన ఆయుధంగా వాక్సినేషన్ ఉద్భవించింది. ఈ క్రమంలో, భారతదేశ వ్యాప్తంగా ఉన్న తన సంస్థలకు చెందిన సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు పవర్‌గ్రిడ్ వాక్సినేషన్ శిబిరాలను నిర్వహిస్తోంది. కోవిడ్ 19 మహమ్మారి నుంచి తమ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, పదవీవిరమణ చేసినఉద్యోగులు, వారి కుటుంబాలు, కాంట్రాక్టు ఉద్యోగులు సహా ఇతర లబ్ధిదారులకు కూడా ఈ వాక్సినేషన్ శిబిరాలు సేవలు అందిస్తున్నాయి.

ఈ వాక్సినేషన్ శిబిరాలను కొనసాగిస్తూ, పశ్చిమ ప్రాంతం – ఎఎలోని భుజ్ – ఎఎ సబ్ స్టేషన్ (గుజరాత్)లో పవర్‌గ్రిడ్ ఒక శిబిరాన్ని నిర్వహించింది. ఇందులో దాదావు 244 వ్యక్తులకు (పవర్‌గ్రిడ్ సిబ్బంది/ కెఇసి సిబ్బంది/ ట్రాన్స్ రెయిల్ సిబ్బంది/ కాంట్రాక్టు కార్మికులు తదితరులు) టీకాకరణ జరిగింది.

ఇటువంటి మరొక శిబిరాన్ని2 జూన్, 2021న షికార్‌పూర్ (పూణె–మహారాష్ట్ర)లో నిర్వహించింది. ఈ శిబిరంలో పవర్‌గ్రిడ్ షికార్‌పూర్ కార్యాలయానికి చెందిన 140మంది వ్యక్తులకు టీకా వేశారు. పశ్చిమ ప్రాంతం –ఎ పరిధిలో ఉన్న పలు సబ్ స్టేషన్లలో కూడా వాక్సినేషన్ డ్రైవ్‌లను ఏర్పాటు చేశారు.

తూర్పు ప్రాంతం –ఎ కిందకు వచ్చే సీతామడి సబ్ స్టేషన్ (బీహార్)లో కూడా వాక్సినేషన్ శిబిరాన్ని నిర్విహించగా, ఇక్కడ కోవిడ్ –19 నుంచి కాపాడేందుకు 71మందికి టీకాలు వేశారు.

ఉత్తర ప్రాంతం –ఎఎఎ పరిధిలోని రెసిడెన్షియల్ కాలనీలో సిబ్బంది, వారిపై ఆధారపడినవారి కోసం ఆగ్రా సబ్ స్టేషన్ వాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరంలో అందరు వ్యక్తులకూ ఉచితంగా టీకా వేశారు. కాలనీలో మిగిలిపోయిన వ్యక్తులందరికీ కూడా టీకా వేసేందుకు 5 జూన్ 2021న ఆగ్రా సబ్ స్టేషన్ మరొక వాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహించనుంది. ఈ శిబిరంతో ఆగ్రా సబ్ స్టేషన్ తన సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు పూర్తి టీకాకరణను పూర్తి చేస్తుంది.

దేశవ్యాప్తంగా ఉన్న పవర్ గ్రిడ్ సంస్థలలో వాక్సినేషన్ శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ వాక్సినేషన్ శిబిరాలను జాతీయ మిషన్‌లో భాగంగా నిర్వహిస్తున్నారు.

విద్యుత్ ఉత్పత్తి ఖర్చును తగ్గించేలా స్వదేశీ బొగ్గు వినియోగంలో సౌలభ్యతకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అనుమతి

న్యూఢిల్లీ, జూన్ 4:విద్యుత్ ఉత్పత్తి వ్యయాలను తగ్గించే లక్ష్యంతో, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల మధ్య దేశీయ బొగ్గును ఉపయోగించుకునే సౌలభ్యాన్ని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ఈ సౌలభ్యం ద్వారా; విద్యుత్ ఉత్పత్తి ఖర్చును తగ్గించేందుకు, 'కేస్–2 సినారియో–4' విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో తమ లింకేజీ దేశీయ బొగ్గును రాష్ట్రాలు ఉపయోగించుకోవచ్చు. ఈ పొదుపు మొత్తం విద్యుత్ వినియోగదారులకు బదిలీ అవుతుంది.

ప్రస్తుతానికి పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ ప్రజలు దీని నుంచి లబ్ధి పొందుతారు. ఒక్క పంజాబ్‌లోనే ఈ ప్రయోజనం ఏడాదికి రూ.300 కోట్లుగా అంచనా వేస్తున్నారు.

విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను ఇది తగ్గిస్తుంది, 'ఆత్మనిర్భర్ భారత్'కు అనుగుణంగా ఉంటుంది. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో తక్కువ 'స్టేషన్ హీట్ రేట్'తో మరింత సమర్థవంతంగా బొగ్గును ఉపయోగించుకోవడం వల్ల కర్బన ఉద్గారాలు కూడా తగ్గుతాయి.స్వదేశీ బొగ్గు వినియోగంలో సౌలభ్యత కింద; కేస్–2 సినారియో–4 కింద పోటీ బిడ్డింగ్ ద్వారా ఏర్పాటు చేసిన ప్లాంట్లలో తమ సమగ్ర లింకేజీ బొగ్గును, అంటే "అగ్రిగేటెడ్ యాన్యువల్ కాంట్రాక్ట్ క్వాంటిటీ"ని (ఏఏసీక్యూ) రాష్ట్రాలు ఉపయోగించుకోవచ్చు.

'నెట్ హీట్ రేట్' ఆధారంగా, వేలం పద్ధతిలో కేస్–2 సినారియో–4 విద్యుత్ ప్లాంట్లను నిర్మించారు. ఈ కేంద్రాల నుంచి ఉత్పత్తయిన విద్యుత్తును ఆ రాష్ట్రానికి మాత్రమే సరఫరా చేస్తారు. విద్యుత్ చట్టం–2003లోని సెక్షన్ 63 కింద, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి వేలం ప్రక్రియ ద్వారా ఈ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు.

లింకేజీ బొగ్గును రాష్ట్రం బదిలీ చేసేటప్పుడు, ఆ విద్యుత్ కేంద్రాలు ప్రభుత్వ యాజమాన్యంలోని ప్లాంట్ల కంటే తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి చేసేవి అని నిర్ధరించుకోవచ్చు. దీనివల్ల విద్యుత్ కొనుగోలు ఖర్చు ఆదా అవుతుంది. ఈ మొత్తం పొదుపులు డిస్కమ్‌లకు, తద్వారా వినియోగదారులకు బదిలీ అవుతాయి. ఈ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఆయా రాష్ట్రాలకు సరఫరా చేసే విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి మాత్రమే బదిలీగా వచ్చిన బొగ్గును ఉపయోగించుకుంటాయి.

సిక్కింలో రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు రూపకల్పనకు సాయం అందించేందుకు ఒప్పందం

న్యూఢిల్లీ, జూన్ 4:సిక్కింలోని జిల్లా ప్రధాన రహదారుల ఆధునీకరణ ప్రాజెక్టు రూపకల్పన, ఆకృతి కార్యకలాపాల కోసం 2.5 మిలియన్ డాలర్ల 'ప్రాజెక్ట్ రెడీనెస్ ఫైనాన్సింగ్' (పీఆర్ఎఫ్) రుణం అందించేందుకు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), భారత్ మధ్య ఒప్పందం కుదిరింది. సిక్కింలోని ముఖ్య పట్టణాలు, పల్లెలు, పర్యాటక ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు వల్ల అనుసంధానత పెరుగుతుంది.

భారత్ తరపున కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఆర్థిక వ్యవహారాల విభాగం అదనపు కార్యదర్శి శ్రీ రజత్ కుమార్ మిశ్రా, ఏడీబీ తరపున ఏడీబీ ఇండియా రెసిడెంట్ మిషన్ కంట్రీ డైరెక్టర్ టకియో కొనిషి ఒప్పందంపై సంతకాలు చేశారు.

పర్వత రాష్ట్రమైన సిక్కింలో జిల్లా ప్రధాన రహదారులు, ఇతర రహదారులు, వంతెనలను ఒక ప్రణాళిక, ఆకృతుల ద్వారా అభివృద్ధి చేసి, రహదారి అనుసంధానత పెంచాలన్న ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతకు ఏడీబీ రుణం అండగా నిలుస్తుందని శ్రీ మిశ్రా వెల్లడించారు. ఇది మారుమూల పల్లె ప్రజలకు రహదారి వసతులను, రాష్ట్ర ఆదాయాన్ని పెంచుతుందన్నారు.

"సాధ్యత అధ్యయనాలు, ఎంపిక చేసిన ఉప ప్రాజెక్టుల సమగ్ర ఇంజినీరింగ్ ఆకృతులను సిద్ధం చేయడం, రాష్ట్ర సంస్థల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా 'అమలు సంసిద్ధత'ను నిర్ధరించడం పీఆర్ఎఫ్ ప్రాజెక్ట్ లక్ష్యం. దీనివల్ల ప్రాజెక్టు సకాలంలో పూర్తవుతుంది" అని కొనిషి తెలిపారు. "ఈ ప్రాజెక్టు ద్వారా నిర్మించిన ఆస్తుల దీర్ఘకాలిక మన్నిక కోసం; రహదారి భద్రత, నిర్వహణ, వాతావరణ అనుకూలత, ప్రతికూలతల తగ్గింపు వంటివాటిని ఏర్పాటు చేయడానికి కూడా ఇది సాయపడుతుంది" అని చెప్పారు.

సిక్కిం రహదారులపై తరచూ కొండచరియలు విరిగి పడుతుంటాయి, కోతకు గురవుతుంటాయి. దీనివల్ల అంతర్రాష్ట్ర రవాణాకు ఆటంకం ఏర్పడుతుంది. ఆ రహదారులను అన్ని వాతావరణాలకు తట్టుకునేలా అభివృద్ధి చేయడం అవసరం. ముఖ్య పట్టణాలు, వాణిజ్య కేంద్రాలను అనుసంధానించే జాతీయ, రాష్ట్ర రహదారుల అనుసంధానతలను వృద్ధి చేయడానికి గుర్తించిన జిల్లా ప్రధాన రహదారులు, ఇతర రహదారులను అభివృద్ధి చేయడానికి సిక్కిం రాష్ట్రానికి పీఆర్ఎఫ్ సాయపడుతుంది.

'అభివృద్ధి చేసేందుకు గుర్తించిన ప్రాధాన్యత రహదారుల్లో కొన్నిటిని, రవాణా నిర్వహణ కోసం ఏడీబీ సాంకేతిక సాయంతో 2012లో రూపొందించిన రాష్ట్ర మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. 2011లో ప్రారంభించిన 'ఏడీబీ ఆర్థిక సహాయ ఈశాన్య రాష్ట్రాల రహదారి పెట్టుబడి కార్యక్రమం' కూడా సిక్కింలో రహదారుల అభివృద్ధికి మద్దతుగా నిలిచింది.

తీవ్రమైన పేదరిక నిర్మూలన కోసం తనవంతు ప్రయత్నాలను కొనసాగిస్తూ; నునంవన్న, ప్రగతికర, సుస్థిర ఆసియా–పసిఫిక్ ప్రాంతాన్ని సాధించడానికి ఏడీబీ నిబద్ధతతో ఉంది. 1966లో ఏడీబీని స్థాపించారు. ఇందులోని 68 మంది సభ్యుల్లో ఈ ప్రాంతం నుంచి 49 మంది ఉన్నారు.

ఎస్.డి.జి. ఇండియా ఇండెక్స్, డ్యాష్ బోర్డు ఆవిష్కరణ!

న్యూఢిల్లీ, జూన్ 4:2021వ సవంత్సరానికి సంబంధించి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్.డి.జి.)–భారతదేశపు సూచి, డ్యాష్ బోర్డును నీతీ ఆయోగ్ ఈ రోజు ఆవిష్కరించింది. 2018లో తొలి నివేదిక ఆవిష్కరణనుంచి ఈ సూచీ ప్రతియేటా విడుదలవుతూనే ఉంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సాధించిన ప్రగతిని ఈ సూచీ ర్యాంకుల రూపంలో ఈ సమగ్రంగా తెలియజేస్తూ వస్తోంది. ఇపుడు వరుసగా మూడవ సూచీ విడుదలైంది. దేశంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన ప్రగతిని పర్యవేక్షించేందుకు ఈ సూచీ ప్రధాన ఉపకరణంగా మారింది. అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల మధ్య పోటీతత్వం పెంచేందుకు కూడా ఇది దోహదపడుతోంది. 2021వ సంవత్సరపు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు–భారతదేశ సూచీ, డ్యాష్ బోర్డు పేరిట ఈ నివేదికను నీతీ ఆయోగ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజీవ్ కుమార్ ఆవిష్కరించారు. నీతీ ఆయోగ్ ఆరోగ్య వ్యవహారాల ప్రతినిధి డాక్టర్ వినోద్ పాల్, ముఖ్యకార్యనిర్వహణాధికారి (సి.ఇ.ఒ.) అమితాబ్ కాంత్, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నీతీ ఆయోగ్ సలహాదారు సయుక్తా సమద్దర్ సమక్షంలో ఈ నివేదిక ఆవిష్కరణ జరిగింది. నీతీ ఆయోగ్ రూపకల్పనతో తయారైన ఈ సూచీ, వివిధ భాగస్వామ్య వర్గాలతో విస్తృత సంప్రదింపులతో రూపుదిద్దుకుంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో సలహా సంప్రదింపుల అనంతరం నివేదిక రూపొందింది.; అంతేకాక, భారతదేశంలోని ఐక్యరాజ్యసమితి ఏజెన్సీలు, కేంద్ర గణాంక వ్యవహారాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ, కీలకమైన పలు కేంద్ర మంత్రిత్వ శాఖలను కూడా సంప్రదించి ఈ నివేదికకు రూపకల్పన చేశారు.

సూచీ నివేదిక ఆవిష్కరణ సందర్భంగా నీతీ ఆయోగ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజీవ్ కుమార్ మాట్లాడారు. "ఎస్.డి.జి. ఇండియా ఇండెక్స్, డ్యాష్ బోర్డు ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను పర్యవేక్షించేందుకు తాము చేసిన కృషి విస్తృత స్థాయిలో గుర్తింపు పొందుతూనే ఉందని, ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు కూడా అందుకుందని చెప్పారు.సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సాధించిన ర్యాంకులను లెక్కించే సమాచారంతో కూడిన మిశ్రమ సూచీగా ఈ నివేదిక నిలిచింది. సుస్థిర అభివృద్ధిపై అంతర్జాతీయ స్థాయిలో జరిగే పర్యవేక్షణా కృషికి ఇది దోహదపడగలదని మేం విశ్వసిస్తూ ఉన్నాం." అని ఆయన అన్నారు.

2030వ సంవత్సరపు అజెండాను సాధించేందుకు మేం జరిపే ప్రయాణంలో ఇంకా మూడింట ఒక వంతు మిగిలి ఉండగానే, ఈ మూడవ సూచీ ఎన్నో ప్రత్యేకతలు సాధించిందని, సుస్థిర అభివృద్ధి ప్రాధాన్యత, భాగస్వామ్యంపై ఈ నివేదిక దృష్టిని కేంద్రీకరించిందని, నీతీ ఆయోగ్ సి.ఇ.ఒ. అమితాబ్ కాంత్ అన్నారు. "మేం పటిష్టపరిచిన భాగస్వామ్యాలను ఈ నివేదిక ప్రతిబింబిస్తోంది. పరస్పర సహాయ సహకారాలతో తీసుకునే చర్యలు ఎలాంటి మెరుగైన ఫలితాలను, ప్రభావాన్ని అందిస్తాయన్నది ఇది సూచిస్తోంది." అని ఆయన అన్నారు. నీతీ ఆయోగ్ లో ఆరోగ్య వ్యవహారాల సభ్యుడు డాక్టర్ వినోద్ పాల్ మాట్లాడుతూ,"కలసికట్టుగా పనిచేయడం ద్వారా మరింత పటిష్టమైన, సుస్థిరమైన భవితను నిర్మించుకోగలమని స్పష్టమైంది, ఈ ప్రక్రియలో ఎవరూ వెనుకబడటం అంటూ ఉండదు." అన్నారు.

నీతీ ఆయోగ్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సలహాదారు సయుక్తా సమద్దర్ మాట్లాడుతూ, "2018లో తొలి సూచీ నివేదికను 13 లక్ష్యాలు, 62 సూచికలకు వర్తింపజేయగా, తాజాగా మూడవ సూచీని 16లక్ష్యాలు, 115 సూచికలకు వర్తింపజేయగలిగాం. 17వ లక్ష్యంపై నాణ్యతతో కూడిన సూచీని అంచనా వేయగలిగాం," అన్నారు.

దేశంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై పర్యవేక్షణ లక్ష్యంగా రెండు నిర్దేశాలను నీతీ ఆయోగ్ నిర్ణయించింది. తద్వారా రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల మధ్య పోటీ తత్వాన్ని, సహకార ఫెడరల్ తత్వాన్ని ప్రోత్సహిస్తోంది. 2030వ సంవత్సరపు అజెండా ప్రకారం సమగ్రమైన ప్రపంచ స్థాయి లక్ష్యాలను ఈ సూచీ ప్రతిబింబిస్తోంది. మరోవైపు జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉంటోంది. అభివృద్ధి లక్ష్యాల విస్తృత ప్రాతిపదికగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రగతిని అంచనా వేసేందుకు సంసిద్ధమైన ఉపకరణంగా ఈ సూచీ ఉపయోగపడుతుంది. ఆరోగ్యం, విద్య, లైంగిక అంశాలు, ఆర్థిక ప్రగతి, సంస్థలు, వాతావరణ మార్పులు, పర్యావరణం తదితర అంశాలపై ప్రగతిని అంచనా వేసేందుకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది.

పాలమూరు డీసీసీబీని మరింత పటిష్టం చేస్తాం

–హైదరాబాద్‌లో మంత్రుల నివాస సముదాయంలో సమీక్ష

మహబూబ్‌నగర్ జూన్ 4 : పాలమూరు డీసీసీబీని పటిష్టం చేస్తామని వ్యవసాయ, సహకార శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎక్సైజ్, క్రీడల మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా డీసీసీబీ పటిష్టం కోసం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రులు మాట్లాడారు. మహబూబ్ నగర్ డీసీసీబీ మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఉద్యోగుల పనితీరును పెంచేందుకు వివిధ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. రుణాల వసూలుకు డీసీసీబీ డైరెక్టర్లు, సీఈవోలు ప్రధాన పాత్ర వహించాలన్నారు. డీసీసీబీ డైరెక్టర్లంతా శ్రద్ధ తీసుకుని బ్యాంకు రుణాల రికవరీకి సహకరిస్తే మరింత సాయం అందించేందుకు టెస్కాబ్ సిద్ధంగా ఉందన్నారు. సబ్సిడీ రుణాలు, పథకాలు ఆయా బ్రాంచులు, సొసైటీల పరిధిలోని రైతాంగానికి తెలిసేలా చర్యలు తీసుకుని వారికి మేలు చేకూర్చాలన్నారు. డీసీసీబీ చైర్మన్లు, డైరెక్టర్లు, సహకార సంఘాల చైర్మన్లు క్రియాశీలకంగా పనిచేస్తేనే సహకార సంఘాలు పటిష్టమవుతాయిని మంత్రి స్పష్టం చేశారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఆడిట్లు సమయానుసారంగా నిర్వహించాలని తెలిపారు. ఉమ్మడి పాలమూరులోని 77 సహకార సంఘాలను పటిష్టం చేయాలన్నారు. డైరెక్టర్లు, చైర్మన్, వైస్ చైర్మన్, సహకార సంఘాల చైర్మన్లు కలిసికట్టుగా పనిచేసి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అండగా ఉండాలన్నారు. సంఘాలు పటిష్టమైతే గ్రామాల్లోనే రైతులకు సులువుగా రుణాలు లభిస్తాయని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు, ఎండీ మురళీధర్, అడిషనల్ రిజిస్ట్రార్ సుమిత్ర, డీసీసీబీ చైర్మన్ నిజాం పాషా, సీఈవో ప్రకాశ్, వైస్ చైర్మన్ వెంకటయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అర్థికంగా బలహీన వర్గాలకు చెందిన వారికి ఎన్ఎఫ్ఎస్ఏ రేషన్ కార్డులను జారీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచన

న్యూఢిల్లీ, జూన్ 4:ప్రస్తుత కోవిడ్–19 మహమ్మారి దృష్టాంతం నేపథ్యంలో సమాజంలో అత్యంత దుర్బలమైన జీవనం గడుపుతున్న వారికి.. ఆర్థికంగా బాగా బలహీనమైన వర్గాలకు చెందిన వారికి తగిన కవరేజ్‌ను నిర్ధారించేందుకు జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జనాభాలో అత్యంత ఆర్థికంగా బలహీనమైన వర్గాలకు ఎన్ఎఫ్ఎస్ఏ రేషన్ కార్డులను చేరువ చేసేలా చూసేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది.

కాంగ్రెస్ నుంచి 200 మంది టీఆర్ఎస్‌లోకి..

ఖమ్మం, జూన్ 4: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 200 మంది కాంగ్రెస్ కుటుంబాల వారు గురువారం టీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ మంత్రి అజయ్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఇస్సాక్ షేక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఫరీద్ ఖాద్రీతోపాటు 200 మంది టీఆర్ఎస్‌లోకి వచ్చారు. గులాబీ పార్టీలోకి వచ్చిన వారిలో సోమనబోయిన స్వర్ణ, తోడేటి వసంత, కాంగ్రెస్ మైనార్టీ సెల్ నేతలు సయ్యద్ జిలానీ, ఎస్‌కే.జానీ, ఎండీ కరీం, సాజిదాబేగం, షామిమ్, గౌస్, ఖాద్రి, సయ్యద్ ఇస్మాయిల్, ఫసిద్దీన్, ఎస్టీ సెల్ నేత శ్రీనివాసరావు, ఇతర నాయకులు రవి, చైతన్య యాదవ్, చిర్రా హనుమంతరావు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిని అడ్డుకోవడం తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు చేయరని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్‌లో గుర్తింపు లేదన్నారు. కేసీఆర్ పాలన నచ్చిన ప్రజలు అన్ని పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నేతలు ఖమ్మం నగరంలో గతంలో వారు చేసిన అభివృద్ధిని చెప్పలేకపోతున్నారని, కానీ అబద్ధాలు చెప్పడంలో ముందు వరుసలో ఉంటున్నారని విమర్శించారు. రూ.వేల కోట్లతో ఖమ్మం రూపురేఖలు మార్చిన ఘనత టీఆర్ఎస్ పార్టీదేనని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి ఆర్‌జేసీ కృష్ణ, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, టీఆర్ఎస్ నగర అధ్యక్షుడు, కార్పొరేటర్ కమర్తపు మురళి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే రోజు 94 మందికి రూ.42.58 లక్షల చెక్కులు

ఖమ్మం,జూన్ 4:: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ నుంచి 94 మందికి మంజూరైన రూ.42.58 లక్షల విలువైన చెక్కులను గురువారం వీడీవోస్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి అజయ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో రూ.లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చికిత్సలు చేయించుకున్న వారిని ఆదుకోవాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి నిండు మనస్సుతో తన సహాయ నిధి నుంచి సాయం మంజూరు చేస్తున్నారని అన్నారు. మేయర్ నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, టీఆర్ఎస్ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి ఆర్‌జేసీ కృష్ణ, నగర అధ్యక్షుడు కమర్తపు మురళి, కార్పొరేటర్లు, టీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆపద్బంధు.. సీఎంఆర్ఎఫ్

-ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ, జూన్ 4: నిరుపేదలను సీఎం సహాయనిధి ఆపద్బంధులా ఆదుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గురువారం హన్మకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 9 మందికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.6.21లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సంద ర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నార న్నారు. పేదలకు అన్ని రకాలుగా అండగా ఉండాలన్న సంక ల్పంతో అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు సిబ్బందిని నియమిస్తున్నారని అన్నారు. కరోనా మహమ్మా రితో ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను వివిధ రకాల పథకాల ద్వారా ఆదుకుంటోందన్నారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ప్రైవేట్ హాస్పిటళ్లలో చికిత్స పొందిన వారి బిల్స్‌ను నియో జకవర్గం కార్పొరేటర్లు, స్థానిక నాయకులు తన దృష్టికి తీసుకురాగానే వారికి సాధ్యమైనంత త్వరగా సీఎం సహా య నిధి నుంచి నిధులు మంజూరు చేయిస్తున్నట్లు చీఫ్ విప్ దాస్యం తెలిపారు. టీఆర్ఎస్ నాయకులు మాడిశెట్టి శివశంకర్, పులి రజినీకాంత్, కోన శ్రీకర్, సుగుణాకర్‌రెడ్డి, సుంచు కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులకు మాస్కులు, శానిటైజర్స్ పంపిణీ చేసిన మై వేములవాడ ఛారిటబుల్ ట్రస్ట్

రాజన్న సిరిసిల్ల, జూన్ 4(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు శుక్రవారం మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాస్కులు శానిటైజర్స్ పంపిణీ చేశారు.కరోనా కట్టడికి అహర్నిశలు కృషి చేస్తున్న హోంగార్డులు చేస్తున్న సేవలు మరువలేనివని మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు సభ్యులు అన్నారు .ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కుమ్మరి శంకర్ , రవికుమార్ తదితరులు ఉన్నారు

12 ఏళ్లలోపు పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు మొదట వ్యాక్సినేషన్

భోపాల్, జూన్ 4: : మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. 12 ఏళ్లలోపు పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు వ్యాక్సినేషన్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. మూడో వేవ్‌లో కరోనా పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపనుందన్న వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెల్లడించారు. దీనివల్ల వారి పిల్లలకు వైరస్ సోకినా.. ఆ తల్లిదండ్రులు వారిని జాగ్రత్తగా చూసుకునే వీలు కలుగుందని ఆయన చెప్పారు.

ఇప్పటికే రాష్ట్రంలో సెకండ్ వేవ్‌ను కట్టడి చేసినా.. మూడో వేవ్ వస్తుందన్న ఆందోళన ఉన్నదని శివరాజ్ అన్నారు. అందుకే పిల్లల కోసం ప్రత్యేకంగా వార్డులు ఏర్పాటు చేసి, ఆరోగ్య సేవలను మెరుగు పరచినట్లు ఆయన తెలిపారు. ఇక విదేశాలకు వెళ్లే విద్యార్థులకు కూడా వ్యాక్సిన్‌ను ప్రాధాన్యతా క్రమంలో ఇవ్వనున్నట్లు చెప్పారు.

బ్రిక్స్ దేశాల సంప్రదాయ ఔషధ ఉత్పత్తుల ప్రామాణీకరణ నియంత్రణ స్థిరీకరణపై వెబ్‌నార్

న్యూఢిల్లీ, జూన్ 4:"బ్రిక్స్ దేశాల సంప్రదాయ ఔషధ ఉత్పత్తుల ప్రామాణీకరణ నియంత్రణ స్థిరీకరణ"పై కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఇటీవల వెబ్‌నార్ నిర్వహించింది. భారతదేశ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. భారత్, చైనా, దక్షిణాఫ్రికా, రష్యా, బ్రెజిల్ దేశాల సంప్రదాయ ఔషధ రంగాలకు చెందిన నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు వెబినార్‌లో పాల్గొన్నారు. ప్రస్తుత వెబినార్ నిర్వహణ కోసం, ఈ ఏడాది ఫిబ్రవరి 24-26 తేదీల్లో జరిగిన సమావేశంలోనే భారత్ ప్రతిపాదించగా, సభ్య దేశాలు అంగీకరించాయి. "సంప్రదాయ ఔషధ రంగంలో బ్రిక్స్ నిపుణులు" పేరిట ఈ ఏడాది మార్చి 25న కూడా ఆయుష్ మంత్రిత్వ శాఖ వర్చువల్ సమావేశం నిర్వహించింది.

ఆయుష్ మంత్రిత్వ శాఖ సలహాదారుడు డా.మనోజ్ నేసరి ఈ వెబినార్‌కు అధ్యక్షత వహించి, ప్రారంభోపన్యాసం చేశారు.

వెబినార్ గురించి వివరిస్తూ, బ్రిక్స్ దేశాల సహకారాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో, సంప్రదాయ వైద్య రంగంలో "భారతదేశ బ్రిక్స్ 2021" ప్రాధాన్యతలను డా.నేసరి వివరించారు. భారత్ చేసిన ప్రతిపాదనల్లో, 'సంప్రదాయ ఔషధ రంగంలో బ్రిక్స్ సహకారంపై అవగాహన ఒప్పందం', 'సంప్రదాయ ఔషధాలపై బ్రిక్స్ ఫోరం' (బీఎఫ్‌టీఎం) ఏర్పాటు వంటి అంశాలు ఉన్నాయి. బ్రిక్స్ దేశాల మధ్య సంప్రదాయ ఔషధ ఉత్పత్తుల ప్రామాణీకరణ నియంత్రణ స్థిరీకరణ అవసరాన్ని డా.నేసరి స్పష్టం చేశారు. ఆయుష్ ఔషధాల ద్వారా కొవిడ్‌ను నియంత్రించడానికి భారత్ తీసుకున్న చర్యలను కూడా ప్రముఖంగా ప్రస్తావించారు.

ఔషధ నిబంధనలు, సేవ ప్రమాణాలు ఉ నిబంధనలు, సంప్రదాయ ఔషధాల ఫార్మాకోపోయియల్ ప్రమాణాలపై బ్రిక్స్ ప్రతినిధులు తమ దేశాల తరపున వెబినార్ మొదటి సెషన్‌లో ప్రదర్శనలు ఇచ్చారు. "ఆయుష్ నిబంధనలు, ఫార్మాకోపోయియల్ ప్రమాణాలు", "భారత సంప్రదాయ ఔషధాల ఫార్మాకోపోయియా - ఒక అవలోకనం", "ఆయుష్ ఆరోగ్య సంరక్షణ సేవల ప్రామాణీకరణ, నియంత్రణ" అంశాలను భారత్ తరపున వివరించారు. రెండో సెషన్‌లో, సంప్రదాయ ఔషధ పరిశ్రమ వర్గాల మధ్య చర్చలు జరిగాయి. ఈ సెషన్‌లో, భారత్, చైనా దేశాల సంప్రదాయ ఔషధ పరిశ్రమల ప్రతినిధులు సమగ్ర ప్రదర్శనలు ఇచ్చారు.

బ్రిక్స్ దేశాలతోసహా ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ ఔషధాలను ప్రోత్సహించడానికి భారత్ చేపట్టిన ప్రయత్నాల బ్రిక్స్ దేశాల సంప్రదాయ వైద్య రంగ నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ విషయంలో సహకారం, మద్దతును అందిస్తామని ప్రకటించారు.

ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లపై వాణిజ్య మార్జిన్‌ను నియంత్రించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, జూన్ 4:కోవిడ్ మహమ్మారి వల్ల ఏర్పడిన అసాధారణ పరిస్థితుల ఫలితంగా ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ల గరిష్ట రీటైల్ ధరలలో అస్థిరతను దృష్టిలో పెట్టుకుని, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ల ధరలను క్రమబద్ధీకరించేందుకు రంగంలోకి దిగాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం సేకరించిన సమాచారం ప్రకారం పంపిణీదారు స్థాయిలో మార్జిన్ 198% దరిదాపుల్లో ఉంది.

ప్రజల విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని డిపిసిఒ, 2013లోని పారా 19 కింద అసాధారణ అధికారాలను ఉపయోగిస్తూ, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లపై పంపిణీదారు స్థాయిలో ధర (పిటిడి) పై వాణిజ్య మార్జిన్‌ను 70%గా ఎన్‌పిపిఎ నియంత్రించింది. ఇంతకుముందు, ఎన్‌పిపిఎ యాంటీ-కాన్సర్ మందులపై వాణిజ్య మార్జిన్‌ను ఫిబ్రవరి 2019లో విజయవంతంగా నియంత్రించింది. నోటిఫై చేసిన వాణిజ్య మార్జిన్ ఆధారంగా సవరించిన ఎంఆర్‌పిని మూడు రోజుల లోపల నివేదించవలసిందిగా ఎన్‌పిపిఎ ఉత్పత్తిదారులను/ దిగుమతిదారులను ఆదేశించింది. సవరించిన ఎంఆర్‌పి ధరలను ఎన్‌పిపిఎ వారం రోజులలో బహిరంగం చేయనుంది.

ఉత్పత్తిదారు అందచేసిన ధరల జాబితాను ప్రతి రీటైలర్, డీలరు, ఆసుపత్రి, సంస్థ తమతమ వాణిజ్య ప్రాంగాణాలలో అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలి. తద్వారా ఈ విషయం గురించి తెలుసుకోవాలన్న ప్రతి వ్యక్తికీ అది అందుబాటులో ఉంటుంది. వాణిజ్య మార్జిన్‌పై నియంత్రించిన తర్వాత సవరించిన ఎంఆర్‌పికి అనుగుణంగా వ్యవహరించని ఉత్పత్తిదారులు/ దిగుమతి దారులు ఔషధాల (ధరల నియంత్రణ) ఉత్తర్వు, 2013ను, నిత్యావసరాల వస్తువుల చట్టం, 1955తో కలిపి అమలు చేస్తూ అందులోని ప్రొవిజన్ల కింద వారిపై 100%వరకు జరిమానా, 15% వడ్డీతో కలిపి అధికంగా వసూలు చేసిన మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి వస్తుంది. బ్లాక్ మార్కెటింగ్ ఉదంతాన్ని నివారించేందుకు సవరించిన ఎంఆర్‌పికన్నా అధిక ధరకు ఉత్పత్తిదారు, డిస్ట్రిబ్యూటర్, రిటైలర్ వినియోగదారుకు అమ్మకుండా నియంత్రించేందుకు, వారు ఉత్తర్వులకు కట్టుబడి ఉన్నారా అనే విషయాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్లు (ఎస్‌డిసిలు) పని చేస్తారు.

సమీక్షకు లోబడి ఈ ఉత్తర్వులు 30 నవంబర్ 2021వరకూ అమలులో ఉన్నప్పటికీ, దేశంలో కోవిడ్ 2.0 మహమ్మారి కారణంగా కేసులు పెరిగిన నేపథ్యంలో, మెడికల్ ఆక్సిజన్‌కు డిమాండ్ చెప్పుకోదగినంతగా పెరిగింది. మహమ్మారి కాలంలో దేశంలో ఆక్సిజన్ ను, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను తగిన పరిమాణంలో నిరాటంకంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ అనేది జాబితాలో లేని ఔషధం, ప్రస్తుతం అది కేంద్ర ఔషధ ప్రామాణికత నియంత్రణ సంస్థ (సిడిఎస్‌సిఒ) స్వచ్ఛంద లైసెన్సింగ్ చట్రం కింద ఉంది. దాని ధరలను డిపిసిఒ 2013లోని ప్రొవిజన్ల కింద ధరలను పర్యవేక్షిస్తున్నారు.

వ్యాక్సిన్ వేసుకున్న వారికి కరోనా వచ్చినా చనిపోలేదు: ఎయిమ్స్ అధ్యయనం

న్యూఢిల్లీ, జూన్ 4:కరోనా వైరస్ కోసం పూర్తిస్థాయిలో లేదా కనీసం సింగిల్ డోసు వ్యాక్సిన్ వేసుకున్న వారికి వైరస్ సోకిన సందర్భాలు ఉన్నా.. వాళ్లలో ఎవరూ చనిపోలేదని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) అధ్యయనం తేల్చింది. గత ఏప్రిల్-మే నెలల్లో కరోనా సోకిన వారిపై ఈ అధ్యయనం నిర్వహించింది. కరోనా సెకండ్ వేవ్ సమయంలో ఇండియాలో వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత కూడా వైరస్ సోకిన వారి శాంపిళ్లపై జీనోమిక్ సీక్వెన్స్ అధ్యయనం నిర్వహించారు. అందులోనే ఈ విషయం వెల్లడైంది. వ్యాక్సిన్ వేసుకున్న తర్వాత కూడా వైరస్ సోకితే దానిని బ్రేక్‌త్రూ ఇన్ఫెక్షన్‌గా పిలుస్తున్నారు.

అధ్యయనంలో ఏం తేలింది?

వ్యాక్సిన్ తీసుకున్న వారిలోనూ వైరల్ లోడ్ అధికంగా ఉన్నా కూడా దీనివల్ల ఎవరూ చనిపోలేదని ఈ అధ్యయనంలో తేలింది. మొత్తం 63 బ్రేక్‌త్రూ ఇన్ఫెక్షన్లలో 36 మంది రెండు డోసులూ తీసుకోగా.. 27 మంది ఒక డోసు తీసుకున్న వాళ్లు ఉన్నారు. వీళ్లలో 10 మంది కొవిషీల్డ్, 53 మంది కొవ్యాక్సిన్ తీసుకున్నారు. అయితే బ్రేక్‌త్రూ ఇన్ఫెక్షన్లలో ఏదీ ప్రాణాంతకం కాలేదని ఈ అధ్యయనంలో తేలింది. కాకపోతే ఈ కేసులన్నింటిలోనూ ఐదు నుంచి ఏడు రోజుల వరకూ అధిక జ్వరంతో బాధపడ్డారు. ఈ 63 మందిలో 21 నుంచి 92 ఏళ్ల వయసులు వాళ్లు ఉన్నారు.

వీళ్లలో ఎవరికీ దీర్ఘకాలిక వ్యాధులు లేవు. పది మందిలో పూర్తిస్థాయి ఇమ్యూనోగ్లోబులిన్ జీ యాంటీబాడీలు గుర్తించారు. వీళ్లలో ఆరుగురికి ఇన్ఫెక్షన్ సోకడానికి నెల రోజుల ముందే యాంటీబాడీలు వృద్ధి చెందగా.. నలుగురిలో ఇన్ఫెక్షన్ తర్వాత యాంటీబాడీలు వృద్ధి చెందాయి.

కష్టకాలంలోను సంక్షేమ పథకాల అమలు

మహబూబాబాద్, మహబూబ్‌నగర్, జూన్ 4:: రాష్ట్రం ఎంత కష్ట కాలంలో ఉన్నా ఎక్కడ కూడా సంక్షేమ పథకాల్లో రాజీ పడకుండా అమలు చేస్తున్న గొప్ప సీఎం కేసీఆర్ అని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. నెల్లికుదురు మండలంలోని టీఆర్ఎస్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కరోనా నుంచి మనల్ని మనమే కాపాడుకోవాలన్నారు. కరోనా నేపథ్యంలో భౌతిక దూరం పాటించాలని, మాస్కులు ధరించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్ , వెన్నాకుల వాణి, యాదగిరి రెడ్డి, భోజ్య నాయక్ పరిపాటి వెంకట్ రెడ్డి, వెన్నకుల శ్రీను, విజయ్, రెహ్మాన్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

హుజురాబాద్‌లో ఈటల ఓడిపోవడం ఖాయం: మంత్రి గంగుల

కరీంనగర్ జూన్ 4(నేటినిజం ప్రతినిధి): బడుగు బలహీన వర్గాల గురించి మాట్లాడే అర్హత మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు లేదని మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. ఈటల అధీనంలో ఉన్న పేదల భూములను బాధితులకు ఇప్పించండి అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని కోరుతున్నానని, లేదంటే ఈటల అవినీతికి మీరు మద్దతు ప్రకటించినట్లేనని గంగుల తెలిపారు. కరీంనగర్‌లో మంత్రి గంగుల మీడియా సమావేశంలో మాట్లాడారు.

ఆత్మగౌరవం పేరుతో ఈటల బడుగు బలహీనవర్గాలను మోసం చేస్తున్నారు. ఆత్మగౌరవం అన్న నీవు ఢిల్లీలో ఎక్కడ తాకట్టు పెట్టావు. కారుకు ఓనర్ అన్న నీవు బీజేపీకి క్లీనర్ అయ్యావా. బడుగు బలహీన వర్గాలకు ఎలాంటి ఆత్మగౌరవం ఇస్తారని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా చెప్పారా. నల్ల చట్టాలను తెల్లచట్టాలు చేస్తామని ఏమైనా హామీ ఇచ్చారా. బలహీన వర్గాలకు కేంద్రంలో మంత్రి పదవులు ఇస్తామని చెప్పారా. ఆత్మగౌరవం గురించి బీజేపీ ఏం హామీ ఇచ్చిందో ఈటల చెప్పాలి. ఏడేళ్ల నుంచి ఆత్మగౌరవం గుర్తుకు రాలేదా. ఈటల సీఎం కేసీఆర్ బొమ్మపైనే గెలిచారు. ఆస్తుల రక్షణ కోసమే ఈటల బీజేపీలోకి వెళ్తున్నారు. హుజురాబాద్‌లో ఈటల వందశాతం ఓడిపోవడం ఖాయం. హుజురాబాద్‌లో బలంగా ఉన్నది టీఆర్ఎస్..ఈటల కాదు. ఈటల బీజేపీలో చేరితే అక్కడ ఆపార్టీకి ఉన్న ఓట్లు కూడా పోతాయని' మంత్రి పేర్కొన్నారు.

బంజారాహిల్స్‌లో రోడ్డుప్రమాదం.. లారీని ఢీకొట్టిన అంబులెన్స్

హైదరాబాద్ , జూన్ 4 : నగరంలోని బంజారాహిల్స్‌లో శుక్రవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. పంజాగుట్ట నుంచి బంజారాహిల్స్ వైపు వస్తున్న అంబులెన్స్.. రోడ్డు నంబర్ 2 వద్దకు రాగానే లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ నరసింహ స్వల్పంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో అంబులెన్స్‌లో ఎవరూ లేరు. కేవలం డ్రైవర్ మాత్రమే ఉన్నారు. ఈ ప్రమాదంతో అక్కడ కాసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు

'నౌకాదళం & రక్షణ సిబ్బంది' సంయుక్త కార్యదర్శిగా రియర్ అడ్మిరల్ కపిల్ మోహన్ ధిర్ నియామకం

న్యూఢిల్లీ, జూన్ 4:సైనిక వ్యవహారాల విభాగంలో 'నౌకాదళం ఉ రక్షణ సిబ్బంది' సంయుక్త కార్యదర్శిగా రియర్ అడ్మిరల్ కపిల్ మోహన్ ధిర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ బాధ్యతలు స్వీకరించిన మొట్టమొదటి సాయుధ బలగాల అధికారి ఈయన. పుణె, ఖడక్‌వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి. 1985 జనవరి 1న నౌకాదళంలో నియమితులయ్యారు.

రియర్ అడ్మిరల్ కపిల్ మోహన్ ధిర్ అత్యంత అనుభవజ్ఞుడైన మెరైన్ కమాండో (మార్కోస్). ఐఎన్ఎస్ అభిమన్యు, ఐఎన్ఎస్ ఖంజర్, ఐఎన్ఎస్ రాణా ద్వారా సముద్రంపై, ఒడ్డున చేపట్టిన అనేక అసైన్‌మెంట్లలో పాల్గొన్నారు. ఆపరేషన్ పవన్, ఆపరేషన్ జూపిటర్ సహా భారత్‌లో, వెలుపల నిర్వహించిన శాంతి పరిరక్షణ ఆపరేషన్లలోనూ సేవలు అందించారు. తూర్పు నౌకాదళం ఫ్లీట్ ఆపరేషన్స్ ఆఫీసర్‌గా, కోచిలో 'ఇండియన్ నేవల్ వర్కప్ టీమ్' ఇంఛార్జ్ కమాండర్‌గా ముఖ్యమైన బాధ్యతలు నిర్వర్తించారు.

నౌకాదళ ప్రధాన కార్యాలయాలు, సమీకృత భద్రత బలగాల ప్రధాన కార్యాలయాల్లో వివిధ హోదాల్లో పనిచేయడం ద్వారా రక్షణ మంత్రిత్వ శాఖకు సంబంధించి రియర్ అడ్మిరల్ కపిల్ మోహన్ ధిర్‌కు విశేష అనుభవం ఉంది. సమీకృత భద్రత బలగాల ప్రధాన కార్యాలయంలో ఏసీఐడీఎస్‌గా; ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలైన 'సులభతర వాణిజ్యం', 'భారత్‌లో తయారీ'ని ప్రోత్సహించడంలో ముఖ్య పాత్ర పోషించారు. ఇందుకోసం, స్వదేశీకరణపై ఎక్కువ దృష్టి పెట్టి, వస్తు సేకరణ ప్రక్రియలను క్రమబద్ధీకరించారు. విధాన రూపకర్తగా, 'వ్యూహాత్మక భాగస్వామ్య విధానం', 'సవరించిన మేక్-2, మేక్-3 విధానాలు' 'సానుకూల స్వదేశీకరణ జాబితా' రూపకల్పనలో భాగస్వామిగా ఉన్నారు. రక్షణ ప్రణాళికలో క్రమబద్ధ విధానాన్ని ప్రవేశపెట్టడంతో పాటు, సామర్థ్య త్రివిధ దళాల సమైక్యతను కూడా పెంచారు.

వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ, ఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజీల నుంచి రియర్ అడ్మిరల్ కపిల్ మోహన్ ధిర్ పట్టభద్రుడు.

దేశ సేవలో చూపిన నిబద్ధతకు బహుమానంగా 'విశిష్ఠ సేవ పతకం', 'అతి విశిష్ఠ సేవ పతకం'ను అడ్మిరల్ కపిల్ మోహన్ ధిర్ అందుకున్నారు.

బీజేపీలోకి మరో సీనియర్ నేత ?-బండి సంజయ్

హైదరాబాద్ , జూన్ 4:తెలంగాణలో రాజకీయం హీటెక్కింది. టీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి ఈటల రాజేందర్ త్వరలో బీజేపీలో చేరనున్నారు. అయితే, ఈటలతోపాటు మరో పెద్ద నాయకుడు కూడా బీజేపీలోకి వస్తారని తెలుస్తోంది. ఈ విషయాన్ని స్వయంగా ఆపార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ వెల్లడించారు. హుజురాబాద్ నియోజకవర్గం పార్టీ నేతలు, కార్యకర్తలకు వర్చువల్ గా సమావేశం నిర్వహించిన బండి సంజయ్.. తమ పార్టీలోకి పెద్ద నాయకుడు రాబోతున్నారని, ఈటలకు మద్దతుగా ఉండాలని సూచించారు. అయితే ఆ నాయకుడు ఎవరనేదానిపై స్పష్టత ఇవ్వలేదు.

దీంతో బీజేపీలోకి వెళ్లబోయే పెద్ద నాయకుడు ఎవరనే సస్పెన్స్ నాయకుల్లో నెలకొంది. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా బీజేపీ వైపు చూస్తున్నారు. కేసీఆర్ కు వ్యతిరేకంగా ఉమ్మడిగా ఐక్య వేదిక ఏర్పాటు చేయాలని కొండా భావించారు. అయితే, ఈటల బీజేపీలోకి వెళ్తుండడంతో అది సాధ్యం కావడం లేదు. దీంతో కొండా బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన బీజేపీ నేతలతో టచ్‌లో ఉన్నారు. మాజీ మంత్రి డీకే అరుణతోనూ భేటీ అయ్యారు. బండి చెప్పింది మాజీ ఎంపీ కొండా గురించా? లేక టీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుడా ? లేకా కాంగ్రెస్ పార్టీ నుంచి వస్తాడా? అన్నది ఉత్కంఠగా మారింది. అటు టీఆర్ఎస్ నేతల్లో కూడా బండి వ్యాఖ్యలపై చర్చ జరుగుతోంది. టీఆర్ఎస్‌లో అసంతృప్తులను మచ్చిక చేసుకునే పనిలో పడినట్లు తెలుస్తోంది. తమ పార్టీల నుంచి ఎవరు వెళ్లిపోతారనే టెన్షన్ కాంగ్రెస్ పార్టీలోనూ ఉన్నట్లు సమాచారం.

ఐదేళ్ల నుంచి ఆత్మగౌరవం గుర్తుకు రాలేదా: మంత్రి కొప్పుల

కరీంనగర్, జూన్ 4: టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు ఎంతో గౌరవం ఇచ్చారని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. రాజేందర్ పార్టీలో కీలకమైన పదవులతో పాటు రెండుసార్లు మంత్రిగా చేశారని గుర్తు చేశారు. కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్, టీఆర్ఎస్ నేతలతో కలిసి మంత్రి కొప్పుల మీడియాతో మాట్లాడారు.

'సీఎం కేసీఆర్..ఈటలను ఎన్నోసార్లు ఎంతో గొప్పగా అభినందించారు. ఆత్మగౌరవం దెబ్బతిన్నట్లు ఆయన మాటల్లో ఎక్కడా కనబడటం లేదు. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను సమావేశంలో అంగీకరించి బయటకు రాగానే వ్యతిరేకంగా మాట్లాడం సరైనదేనా. కేబినెట్ నిర్ణయాలు నచ్చకపోతే సమావేశంలోనే నోట్ చేయొచ్చు. అంతగా నచ్చకపోతే రాజీనామా చేయాల్సి ఉండే. ప్రభుత్వ విధానాలు, పథకాలకు వ్యతిరేకంగా మాట్లాడటం ద్వారా ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించినట్లు కాదా. ఐదేళ్ల నుంచి ఈటల అసంతృప్తిగా పార్టీలో ఎందుకు ఉన్నారు. టీఆర్ఎస్‌లో ఈటల ఏనాడూ అవమానాలు ఎదుర్కోలేదు. ఐదేళ్ల నుంచి ఆత్మగౌరవం గుర్తుకు రాలేదా. ఎక్కువ భూములు ఉన్నవారు రైతుబంధును తిరిగి ఇచ్చారు. ఈటల కుటుంబం ప్రతీ ఏడాది రూ.3.52లక్షల రైతుబంధు సొమ్ము తీసుకుంటున్నదని' మంత్రి పేర్కొన్న

పర్యావరణమే ప్రాణికోటికి జీవనాధారం..!

(05 జూన్ 'ప్రపంచ పర్యావరణ దినం' సందర్భంగా)

భూగోళంపై విస్తరించబడిన పర్యావరణ వ్యవస్థ సకల జీవకోటికి రక్షక కవచంగా ఉంటూ ఆరోగ్య ప్రదాతగా నిలబడి కాపాడుతూ ఉంటుంది. సహజ ప్రకృతికి అంతరాయం కలిగిస్తే, మహమ్మారి భూతాలు పుట్టుకొస్తాయి. విచ్ఛిన్నతకు లోనైన పర్యావరణాన్ని నేటి నుంచి 2050 వరకు పునరుద్ధరించడానికి 8.1 ట్రిలియన్ డాలర్లు అవసరమని, ఏడాదికి 536 బిలియన్ డాలర్లు కేటాయించాల్సి ఉంటుందని ఐరాస అంచనా వేసింది. నేటి విశ్వమానవాళి పర్యావరణ ప్రకోపాన్ని మరియు జీవవైవిధ్య విచ్ఛిన్న దుష్ఫలితాలను మహమ్మారి విపత్తు రూపంలో అనుభవిస్తున్నది. పర్యావరణంలోని శిలావరణం, జీవావరణం, జలావరణం మరియు వాతావరణాలను మనిషి దుర్వినియోగం చేయడం, విచక్షణారహితంగా విధ్వంసం చేయడంతో గాలి, నేల, నీరు కలుషితమై సకల ప్రాణకోటి మనుగడను ప్రమాదంలోకి నెట్టుతున్నది. పర్యావరణ విధ్వంసానికి చరమగీతం పాడుతూ, కోల్పోయిన ప్రకృతి సహజత్వానికి జీవం పోయడం జరుగని యెడల రాబోయే రోజుల్లో మానవాళి జీవనం అసాధ్యమనుతుందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ యజ్ఞాన్ని చేపట్టి, గత ప్రకృతి సహజ వైభవాన్ని పునరుద్ధరించాలనే సందేశాన్ని ప్రపంచ దేశాలకు ఇవ్వడానికి ఒక మంచి వేదికగా 1974 నుంచి ప్రతి ఏటా 05 జూన్ రోజున 'ప్రపంచ పర్యావరణ దినం' పాటించాలని ఐరాస తీర్మాణించింది. నేల నాణ్యతలో క్షీణతతో ఆహార ఉత్పత్తులు ప్రభావితం కావడం, ఆహార కొరత ఏర్పడడం, పేదరికం పెరగడం జరుగుతాయి. అడవుల నరికి వేతతో మనిషికి మరియు వన్య ప్రాణులకు మధ్య సంఘర్షణ జరిగి, జీవ వైవిధ్యం విచ్ఛిన్నం అవుతుంది. ప్రపంచ పర్యావరణ దినం-2021 నినాదంగా 'సముద్ర మరియు ఖండాల్లో పర్యావరణ వ్యవస్థ విచ్ఛిన్నాన్ని నిరోధించడం మరియు నియంత్రించడం, జీవావరణ వ్యవస్థను పునరుద్ధరించడం' అనబడే అంశాన్ని తీసుకొన ప్రచారం చేయడం జరుగుతున్నది. పర్యావరణ విచ్ఛిన్నాలకు మరియు పేదరికానికి, అనారోగ్యానికి అనులోమ సంబంధం ఉంటుందని గమనించాలి.

ఐరాస పర్యావరణ కార్యక్రమంలో భాగంగా పర్యావరణానికి జరిగిన విధ్వంసాన్ని గమనించి, తగు కఠిన చర్యలు తీసుకునే ఉద్దేశంతో రాబోయే 10-సంవత్సరాలను 'పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ దశాబ్దం (ఎకోసిస్టమ్ రీస్టొరేషన్)'గా తీసుకొని గత పర్యావరణ వైభవాన్ని, స్వచ్ఛతను, ఆరోగ్యాన్ని, పరిశుద్ధతను తిరిగి స్థాపించేలా చర్యలు చేపట్టుటకు నిర్ణయించడం ముదావహం. కరోనా మహమ్మారి విజృంభనతో ప్రపంచ మానవాళి నిస్సహాయ స్థితిలో భయకంపితం కావడం జరుగుతున్నది. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని, ప్రకృతి సహజ స్థితిని విచ్ఛిన్నం చేసిన మానవుడు తగు భారీ మూల్యాలను చెల్లించవలసి వస్తున్నది. జీవావరణంతో తలపడితే మనిషి బతుకు నరకప్రాయం అవుతుందని అవగతమైంది. ఈ ప్రమాదకర దుస్థితిని గమనించిన ఐరాస 'రీక్రియేట్ (పునర్ సృష్టి), రీఇమేజింగ్ (తిరిగి పరిస్థితి అంచనా), రీస్టోర్ (పునరుద్ధరించడం)' అనే నినాదంతో 2021-2030 కాల వ్యవధిని 'పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ దశాబ్దం'గా పాటించుటకు 05 జూన్ 2021 ముహూర్తాన్ని నిర్ణయించారు. కోల్పోయిన పునాదులను తిరిగి ప్రతిష్టించుకోవాడానికి సత్వరమే ప్రపంచ దేశాలన్నీ కంకనబద్ధులు కావాలసిందే. వాతావరణానికి, జీవ వైవిధ్యతకు మరియు నేల క్షీణతకు విడదీయరాని సంబంధం ఉంటుంది. జీవ వైవిధ్య విచ్ఛిన్నంతో ప్రతి ఏటా 10 శాతం ఆర్థిక నష్టం జరుగుతోంది. సత్వరమే మేల్కొని పునరుద్ధరణకు పూనికలను యెడల విద్య, వైద్య మరియు ఉద్యోగ రంగాలు తిరోగమన దిశగా కదలడం ఖాయంగా రుజువైంది. ప్రపంచ సుస్థిరాభివృద్ధి జరగడానికి పర్యావరణ పరిరక్షణ అత్యవసరం. అడవుల పోషించడం, నరికివేతను నిషేధించడం, వన్యప్రాణుల రక్షణ, జీవ వైవిధ్యాన్ని కాపాడటం, గ్రామీణ పట్టణ ప్రాంతాలలో హరిత వనాలను పెంచడం, గాలి కాలుష్యాన్ని నిరోధించడం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని కట్టడి చేయడం లాంటి పలు చర్యలను తీసుకుంటూ పర్యావరణ పునరుద్ధరణకు పూనుకోవాలి.

అకాలవర్షం వడగళ్ళు, తుఫానులు, సునామీలు, ప్రకృతి ప్రళయాలు, భూతాపం, మహానగరాల్లో గాలి కాలుష్యం, అంటువ్యాధులు లాంటి ప్రకృతి హెచ్చరికలను మానవుడు అలక్ష్యం చేస్తే, ఎవరు త్రవ్విన గోతిలో వారే పడక తప్పదని నవ్య నరుడు కళ్ళు తెరవాల్సిన సమయం ఆసన్నమైంది. త్రాగడానికి పరిశుభ్రమైన నీరు, పీల్చడానికి స్వచ్ఛమైన గాలి, నడవడానికి ఆరోగ్యకరమైన మట్టి లేనప్పుడు మనిషి సాధించిన అభివృద్ధి అంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. భూ ఉపరితలంపై ఉన్న నీటిలో 2 శాతం మాత్రమే త్రాగడానికి యోగ్యతను కలిగి ఉంటుంది. ప్రపంచ పర్యావరణ దినం-2021 కార్యక్రమ నిర్వహణకు ఐరాస పర్యావరణ కార్యక్రమం మరియు పాకిస్థాన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఆరోగ్యకర పర్యావరణ వ్యవస్థతో మాత్రమే జీవనోపాధులు, వాతావరణ మార్పులు మరియు జీవ వైవిధ్య పరిరక్షణ జరుగుతాయి. 'పీపుల్స్ డే'గా పిలువబడే పర్యావరణ దినం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ అవసరం, పునరుద్ధరణ అవశ్యకత, నేల-నీరు-గాలి కాలుష్య అదుపు జరిగితేనే ప్రాణి కోటి (వృక్షజంతుజాలం) ఆరోగ్యంగా మనగలుగుతుందనే సందేశాన్ని ఇవ్వడం జరుగుతుంది.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ల ధరల నియంత్రణ పై కేంద్రం దృష్టి..

న్యూఢిల్లీ, జూన్ 4:ణ పరిస్థితుల ఫలితంగా ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ల ధరల అస్థిరతను దృష్టిలో పెట్టుకుని, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్ల ధరలను క్రమబద్ధీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం సేకరించిన సమాచారం ప్రకారం డిస్ట్రిబ్యూటర్స్ లెవల్ లో మార్జిన్ 198శాతం ఉంది.ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని డిపిసిఒ, 2013లోని పారా 19 కింద అసాధారణ అధికారాలను ఉపయోగిస్తూ, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లపై పంపిణీదారు స్థాయిలో ధర(పిటిడి) పై వాణిజ్య మార్జిన్ను 70శాతంగా ఎన్పిపిఎ నియంత్రించింది. ఇంతకుముందు, ఎన్పిపిఎ యాంటీ-కాన్సర్ మందులపై వాణిజ్య మార్జిన్ను ఫిబ్రవరి 2019లో విజయవంతంగా నియంత్రించింది. నోటిపై చేసిన వాణిజ్య మార్జిన్ ఆధారంగా సవరించిన ఎంఆర్పిని మూడు రోజుల లోపల నివేదించవలసిందిగా ఎన్పిపిఎ ఉత్పత్తిదారులను, దిగుమతిదారులను ఆదేశించింది. సవరించిన ఎంఆర్పి ధరలను ఎన్పిపిఎ వారం రోజులలో వెల్లడించనుంది.

కాటారంలో నిషేధిత గడ్డి మందు పట్టివేత

జయశంకర్ భూపాలపల్లి,జూన్ 4:: కాటారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్ ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత మందులు అమ్ముతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు క్రాంతి కుమార్ ట్రేడర్స్‌లో సోదాలు నిర్వహించారు. సుమారు రూ. 85 వేల విలువ చేసే 188 లీటర్ల నిషేధిత గడ్డి మందును స్వాధీనం చేసుకున్నారు. ఫర్టిలైజర్ షాప్ యజమాని పై కేసు నమోదు చేశారు. ఎరైనా చట్ట విరుద్ధంగా నిషేధిత గడ్డి మంతు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

భార్యతో విభేదాలు.. పిల్లలను చంపి తండ్రి ఆత్మహత్య..

అమరావతి, జూన్ 4: ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా మలికిపురం మండలంలో విషాద ఘటన జరిగింది. భార్యతో విభేదాల కారణంగా భర్త తన ఇద్దరు పిల్లలకు పురుగుల మందు తాగించి తానూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామశివారులోని గోదావరి నది ఒడ్డున బ్రిడ్జికి సమీపంలో విశ్వనాథం అనే వ్యక్తి తన ఇద్దరు పిల్లలు రేవతి (9), జెస్సీక(8)కి పురుగుల మందు తాగించి తానూ తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ముగ్గురికి స్థానికులు గుర్తించి రాజోలు ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయారు. భార్యతో ఉన్న కలహాల కారణంగా విశ్వనాథం ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

కాళేశ్వరం ప్రాజెక్టు జలాలను చివర ఆయకట్టు వరకు అందించాలి.
-చెక్ డాం నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి.
-రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్.

రాజన్న సిరిసిల్ల, జూన్ 4(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు .

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, చొప్పదండి, మానకొండూర్, శాసనసభ్యులు సుంకే రవిశంకర్ ,రసమయి బాలకిషన్ ,జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ ఇంజనీర్లతో కలిసి మంత్రి సాగు నీటి ప్రాజెక్టు ల పెండింగ్ పనులు, చెక్ డ్యాం ల నిర్మాణాల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వానకాలం పంటల సాగుకు సాగు నీరు అందించుటకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. మధ్య మానేరు ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణ పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేసి ఈ వాన కాలంలో కాలువ కింది చెరువులన్నింటిని నీటితో నింపాలని మంత్రి ఆదేశించారు. జిల్లాకు 33 చెక్ డ్యాములు ప్రభుత్వం మంజూరు చేసిందని, చెక్ డ్యామ్ ల నిర్మాణ పనులు 50 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఇంజనీర్లను ఆదేశించారు .చెక్ డ్యామ్ ల ద్వారా పరిగెత్తే నీటిని ఆపాలని, ఆగిన నీటిని భూమిలో ఇంకెలా చేస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని మంత్రి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు జలాలను చివర ఆయకట్టు వరకు తీసుకెళ్లి బీడు భూములను సస్యశ్యామలం చేయాలని మంత్రి అన్నారు. ఎస్ ఆర్ ఎస్ పి కాలువల లైనింగ్ చెడి పోయిన చోటా వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మానేరు రివర్ ఫ్రంట్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు నారదాసు లక్ష్మణ్ రావు, చొప్పదండి, మానకొండూర్ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ , రసమయి బాలకిషన్ , జిల్లా కలెక్టర్ కె .శశాంక,ఇరిగేషన్ ,ఎస్సారెస్పీ సిఈ శంకర్ , పర్యవేక్షక ఇంజనీర్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు కరీంనగర్,హుజరాబాద్ ఆర్ డి వో లు ఆనంద్ కుమార్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

కొనసాగుతున్న ఆహార ప్యాకెట్ల పంపిణీ

రాజన్న సిరిసిల్ల, జూన్ 4(నేటినిజం ప్రతినిధి): కరోనా బాధితులకు అండగాఉంటామనిఅలాంటి వారికిమనో ధైర్యం నింపుతూమేమున్నామని భరోసా కల్పిస్తూ ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు తోట రామ్ కుమార్ ట్రస్టుఇందులో భాగంగానే శుక్రవారం 21వ రోజు కూలి పని చేసుకునే వారికి, రాజన్న ఆలయ పరిసరాల్లో యాచకులకు, కోవిడ్ మహమ్మారి బారిన పడి చికిత్స పొందుతున్న వారికి, కోవిడ్ బాధిత కుటుంబ సభ్యులకు, కోవిడ్ వ్యాక్సినేషన్ సెంటర్లలో పని చేస్తున్న వైద్య సిబ్బందికి తమ వంతు సహాయంగా టి ఆర్ కె చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ కుమార్ఆధ్వర్యంలో ఆహార ప్యాకెట్లను ట్రస్టు సభ్యులు పంపిణీ చేసి తమ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ కోవిడ్ బారిన పడి ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, మరికొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వారికి పౌష్టిక ఆహారం అందించాలనే దృఢసంకల్పంతో ట్రస్ట్ వ్యవస్థాపకులు ×తోట రామ్ కుమార్ఆహారంఅందజేస్తున్నారని, వారు త్వరగా కోలుకోవాలని అన్నారు. ఆపద సమయంలో టి ఆర్ కె ట్రస్ట్ సేవలు ఎల్లప్పుడూ ముందు ఉంటాయని, ఆపదలో ఉన్నవారు తమ ట్రస్టును సంప్రదిస్తే వారికి తమ వంతు సహాయం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలోటి ఆర్ కె ట్రస్ట్ వర్కింగ్ టీం, ఎంక్వైరీ టీం సభ్యులు పాల్గొన్నారు

జడ్చర్ల ప్రభుత్వ దవాఖానలో కొవిడ్ సెంటర్ ఏర్పాటు

మహబూబ్‌నగర్, జూన్ 4:జడ్చర్ల ప్రభుత్వ దవాఖానలో నూతనంగా ఏర్పాటు చేయబోయే 20 పడకల కొవిడ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సి. లక్ష్మా రెడ్డి పరిశీలించారు. దవాఖాన ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలని డాక్టర్లకు సూచించారు. ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకో రావాలని ఎమ్మెల్యే అన్నారు. దవాఖాన వచ్చిన రోగులకు పూర్తి స్థాయి మెడికల్ కిట్ లను అందుబాటులో ఉంచుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

20 పడుకల ఆక్సిజన్ కొవిడ్ సెంటర్ ఈ వారంలో అందుబాటులో కి వస్తుందని, ఎవరైనా కొవిడ్ బారిన పడిన రోగులు జడ్చర్ల ప్రభుత్వ దవాఖానలో చేరవచ్చని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. అలాగే కరోనా నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పాటు ప్రజల సహకారం కూడా ఉండాలన్నారు. ప్రజలు భౌతిక దూరంతో పాటు మాస్కులు ధరించాలన్నారు.

అంతకుముందు 20వ వార్డులోని ఆర్కే ఫంక్షన్ హాల్ ఏరియాలో రూ. 5.00 లక్షలతో నూతన అండర్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం నల్లకుంట దగ్గర నిర్మిస్తున్న అండర్ డ్రైనేజీ పనులను పరిశీలించారు.

పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. తదుపరి నూతనంగా నిర్మితమువుతున్న 100 పడకల ప్రభుత్వ దవాఖాన బిల్డింగ్ ను సందర్శించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని త్వరలోనే ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షిస్తాం : మంత్రి సత్యవతి

మహబూబ్‌నగర్, జూన్ 4:జిల్లాలోని మరిపెడ మండలం తండ ధర్మారంలో ఇటీవల లైంగికదాడికి గురై హత్యకు గురైన మోడు ఉష కుటుంబాన్ని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు వేగంగా విచారించి దోషులను పట్టుకున్నందుకు, అధికారులు సత్వరమే స్పందించినందుకు అభినందించారు.

బాగా చదువుకుని, కుటుంబానికి అండగా ఉంటుంది అనుకున్న అమ్మాయిపై అఘాయిత్యం చేసి, హత్య చేయడం అత్యంత దురదృష్టకరమని, ఆ కుటుంబానికి ఆ లోటు పూడ్చలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున లక్ష రూపాయలు ఇస్తామని, ఇప్పుడు 25 వేల రూపాయలు ఇస్తున్నాం అని చెప్పారు.

మిగిలిన మొత్తం కేసు వివిధ దశల్లో ఇస్తారని తెలిపారు. రాష్ట్రంలో ఆడపిల్లల పట్ల ప్రభుత్వం ఒక నిఘా నేత్రంగా పని చేస్తుందన్నారు. ఆడపిల్లల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

మోడు ఉష విషయంలో దోషులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని, వాటిని చూసి ఇంకొకరు అలాంటి పనులు చేయకుండా ఉండేలా ఆ శిక్ష ఉంటుందని తెలిపారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం అని చెప్పారు. ఆడపిల్లలు కూడా జాగ్రత్తగా ఉండాలని కోరారు.కార్యక్రమంలో టీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీరంగారెడ్డి, రామ్ లాల్, అఫ్జల్, జిల్లా సంక్షేమ అధికారి సబిత, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జనార్దన్, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నాగవాణి, ఇతర నేతలు, అధికారులు పాల్గొన్నారు.

మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవాలి

ములుగు, జూన్ 4: : మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ అన్నారు. మణుగూరు స్పెషల్ గెరిల్లా దళానికి చెందిన మడకం సంధాల్ అనే మావోయిస్టు ఎస్పీ ముందు లొంగిపోయాడు.

ఛత్తీస్‌గఢ్ చెందిన మడకం సంధాల్ అలియాస్ నందు మావోయిస్టు అనుబంధ సంస్థ బాలల సంఘంలో మూడు సంవత్సరాలు పని చేశాడు.

అనంతరం ఛత్తీస్‌గడ్ లో సోముడు అనే మావోయిస్టు పరిచయం ద్వారా 2018 సంవత్సరంలో చెర్ల అరుణక్క దళంలో దళ సభ్యుడిగా చేరి సంవత్సరం పని చేశారని ఎస్పీ తెలిపారు.

అనంతకం తెలంగాణ స్టేట్ కమిటీ మెంబర్ అయిన ఆజాద్ ఆదేశాల మేరకు మణుగూరు దళంలో స్పెషల్ గెరిల్లా స్క్వాడ్ లచ్చన్నకు గార్డుగా పని చేశాడు .

లచ్చన్న కు గార్డుగా పనిచేసిన సమయంలో ఇతను బట్టమ్ ఫైరింగ్, పెద్దమిడిసిలేరు రోడ్ బ్లాస్టింగ్‌లో జెర్రం ఏరియా టేకులగూడెం వద్ద జరిగిన కాల్పులలో 24 మంది సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్స్ చనిపోయిన సంఘటనలో కూడా నిందితుడిగా ఉన్నాడని తెలిపారు.

లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలను అందజేస్తామన్నారు. మావోయిస్టులు అజ్ఞాత వాసాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చాడు. కార్యక్రమంలో జిల్లా ఓఎస్డీ శోభన్ కుమార్, ములుగు ఏఎస్పీ పోతరాజు సాయి చైతన్య , ఏఎస్పీ చెన్నూరి రూపేష్ పాల్గొన్నారు.

జూన్ 7 నుంచి అన్ని కార్యాలయాలు ఓపెన్!

అహ్మదాబాద్, జూన్ 4:: గుజరాత్ లో కరోనా కేసులు భారీగా తగ్గడంతో కొవిడ్-19 నియంత్రణలను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం భారీగా సడలించింది. జూన్ 7 నుంచి 100 శాతం హాజరుతో అన్ని కార్యాలయాలను తెరిచేందుకు అనుమతించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 36 నగరాల్లో అన్ని షాపులను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ తెరిచేందుకు అనుమతించింది.ఇక రెస్టారెంట్ల హోం డెలివరీ సేవలను రాత్రి పది గంటల వరకూ చేపట్టవచ్చని అధికారులు పేర్కొన్నారు. లాక్ డౌన్ నియంత్రణలు జూన్ 11 వరకూ కొనసాగుతాయని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. రాత్రి కర్ఫ్యూ జూన్ 11 వరకూ పొడిగించినట్టు గుజరాత్ సీఎంఓ ఇప్పటికే పేర్కొన్న సంగతి తెలిసిందే. మరోవైపు గుజరాత్ లో 1207 తాజా పాజిటివ్ కేసులు నమోదవగా మహమ్మారి బారినపడి ఒక్కరోజులో 17 మంది ప్రాణాలు కోల్పోయారు.

18 రోజుల నుండి కొనసాగుతున్న మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సేవలు

రాజన్న సిరిసిల్ల, జూన్ 4(నేటినిజం ప్రతినిధి): మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం 18.వరోజు కార్యక్రమంలో భాగంగా మొత్తం 80 మందికి అన్నదానం చేయడం జరిగింది. లక్ష్మి గణపతి కాంప్లెక్స్ నందు గల కోవిడ్ పేషంట్లకు, వైద్య సిబ్బందికి, కోవిడ్ టెస్ట్ సెంటర్లో ఉన్న వైద్య సిబ్బందికి అలాగే పార్కింగ్ స్థలంలో ఉన్న యాచకులకు కూడా ఆహారం ప్యాకెట్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కుమ్మరి శంకర్, మధు మహేష్, నూగూరి మహేష్ ,గొంగళ్ల రవికుమార్,డ,ప్రశాంత్ , భస్మాంగి బసవరాజు, నాగుల చంద్రశేఖర్ మరియూ పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను విరాళంగా అందిస్తున్న ప్రిన్స్ పైప్స్

హైదరాబాద్ , జూన్ 4:కోవిడ్-19 మహమ్మారితో పోరాడుతున్న తెలంగాణా రాష్ట్ర ప్రయత్నాలకు మద్దతునందించడంలో భాగంగా తమ అంతర్జాతీయ భాగస్వాములు నుంచి ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను విమానమార్గంలో దిగుమతి చేసుకుని విరాళంగా అందించనున్నట్లు ప్రిన్స్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ లిమిటెడ్ (పీపీఎఫ్) తెలిపింది. ఈ నెలలోనే ఈ కాన్సన్ట్రేటర్లను రాష్ట్ర ఉన్నతాధికారులకు అందించనున్నారు. దక్షిణ భారతదేశపు మార్కెట్‌లలో విస్తరించేందుకు తమ 7వ తయారీ కేంద్రాన్ని తెలంగాణాలో ఇటీవల ప్రారంభించారు.ఈ నెలారంభంలో ఈ కంపెనీ బీహార్ మరియు రాజస్థాన్ రాష్ట్రాలలోని రాష్ట్ర యంత్రాంగాలకు 100 ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను అందించింది.

ప్రిన్స్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ లిమిటెడ్?ఏపీపీ స్ట్రాటజీ నిహార్ చెద్దా మాట్లాడుతూ " ఈ నెలలోనే తెలంగాణా రాష్ట్ర ఉన్నతాధికారులకు ఈ ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను అందించనున్నాం. ఈ యంత్రసామాగ్రి అంతా కూడా సీఈ ధృవీకృతం కావడంతో పాటుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలకు లోబడి ఉన్నాయి. తెలంగాణా రాష్ట్రంలో వైద్య మౌలిక వసతులకు మద్దతు సందించాల్సిన అత్యవసర పరిస్థితుల వేళ, ఈ యూనిట్లు ఆక్సిజన్ సిలెండర్లపై ఆధారాపడాల్సిన ఆవశ్యకతను తగ్గిస్తాయి. వాతావరణం నుంచి ఆక్సిజన్‌ను ఈ కాన్సన్ట్రేటర్లు సంగ్రహించడం వల్ల రోగికి సౌకర్యవంతంగా చికిత్సనందించడం వీలవుతుంది. ఈ క్లిష్టకాలంలో మద్దతును కొనసాగించడానికి మేము కట్టుబడి ఉన్నాము" అని అన్నారు.

కరోనా వచ్చిందని భార్యను బాత్‌రూంలో బంధించిన భర్త

ఆదిలాబాద్, జూన్ 4:ఎవరికైనా కరోనా సోకిందని తెలిస్తే హోం ఐసోలేషన్‌లో పెడతారు లేదా ఆస్పత్రిలో చేరుస్తారు. కరోనా బాధితులకు కుటుంబ సభ్యులు ధైర్యం కల్పిస్తూ అండగా ఉంటారు. వైద్యుల సూచన మేరకు కరోనా తగ్గేంత వరకు ఆహారం, మందులు అందిస్తూ సేవలు చేస్తూ ఉంటారు. కానీ కరోనా సోకిన ఓ మహిళ పట్ల తన భర్త అమానుషంగా ప్రవర్తించాడు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో అమానుషం చోటు చేసుకుంది. కరోనా సోకిన మహిళ పట్ల ఆమె భర్త అమానుషంగా వ్యవహరించాడు.కరోనా సోకిందని తన భార్యను భర్త మేడి పెద్దయ్య బాత్‌రూంలో బంధించాడు. దీంతో వారం రోజులుగా బాత్‌రూంలోనే కరోనా బాదితురాలు నరకయాతన అనుభవిస్తోంది. అన్నం నీళ్లు కూడా ఇవ్వలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. అయితే మహిళ సమస్యను స్థానికులు మీడియా దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో పోలీసులు, వైద్యారోగ్యశాఖ యంత్రాంగం రంగంలోకి దిగింది. బాధితురాలి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి ఇంట్లో ఓ రూంలో ఐసోలేట్ చేయించారు.

సహృదయ
సాహిత్య సాంస్కృతిక సంస్థ, వరంగల్లు
ఎ.నెం.2061/96
జూన్ 6, 2021 ఆదివారం సా॥ 4.00 గంటలకు
ZOOM మాధ్యమంగా అంతర్జాలంలో
సహృదయానుబంధ పురస్కార సభ
(కీ.శే. రాళ్ళబండి కవితా ప్రసాద్ స్మారక పురస్కారం)
ముఖ్య అతిథి:
శ్రీ మండలి బుద్ధ ప్రసాద్
పూర్వ ఉప శాసనసభాపతి, ఆం.ప్ర.
విశిష్ట అతిథి:
ఆచార్య సూర్యధనుంజయ
ఉ.వి.వి. తెలుగుశాఖాధ్యక్షులు
పురస్కార స్వీకర్తలు:
(2020 మరియు 2021 సం॥లకు)
శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు IAS
ప్రముఖ రచయిత, సంచాలకులు, విద్యాశాఖ, ఆం.ప్ర.
శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు IAS (Retd.)
రచయిత, దేవాదాయ శాఖ పూర్వ కమీషనర్
కవితా ప్రసాద్ కవిత్వపఠనం
డా॥ తుమ్మూరి లక్ష్మణరావు
అందరూ ఆహ్వానితులే
జి. గిరిజామనోహరబాబు, అధ్యక్షులు
డా॥ ఎన్.వి.ఎన్. చారి, ప్రధాన కార్యదర్శి
Zoom Meeting ID: 7448080443, Password: court

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com